స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్చమైన చిరునామా...

హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

జనవరి-2014 ₹15/-

వెల కట్టలేని
మీ ఆనందానికి
15 రూపాయలు
ఓ లెక్కేనంటారా?





సత్యమూర్తిగారి
కార్టూన్ వైభవం
ప్రత్యేక సంచిక



mohan
PUBLICATIONS
Mohanpublication.com


ఆధ్యాత్మిక, జ్యోతిష్య, వాస్తు, ఆయుర్వేద,
మంత్రశాస్త్ర, స్మార్త గ్రంథములకు
మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదురుగా,
రాజమహేంద్రవరం - 533101.

grantha nidhi
THE TREASURE OF PAGES
FIRSTEVER TELUGU FREE E-BOOKS
DOWNLOADING WEB PORTAL
www.granthanidhi.com
Granthanidhi.blogspot.in

సత్యమూర్తిగారి వర్ణ'చిత్రాలు











సత్యమూర్తిగారి ముఖ'చిత్రాలు





స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్చమైన చిరునామా...

హాస్యానందం

సంపూర్ణహాస్య మాస పత్రిక

జనవరి-2014 ✦ సంపుటి-10 ✦ సంచిక-9

Publisher&Editor : Ramu.P
Chief Artist : A.Dayakar
Cartoon Editor : A.V.M
Full'Pillar : Bnim
Abroad Promoter : V. Pavan Kumar, USA
Well Wishers : Tanikella Bharani
Jaydev
Mallik
Sanku
Designing : Creative Graphix
Creative Team : Tumbali Sivaji
T.Chandra Sekhar
Rampa
P.V.Narayana
Ramsheshu
P.Priyatham
Mallikarjun.U
Address : HASYANANDAM,
#8-215/4,
Near Ramalayam,
Po:YERRABALEM
Pin 522 503,
Mangalagiri Mandal,
Guntur dist.
Ph : 9849630637

email: **hasyanandam @yahoo.com**

Hyderabad & Secunderabad Distributors:



Charminar News Agencies,
1-6-176/1, M.G.Road,
Khandoji Bazar, **Secunderabad-3.**
Ph:9346515813
J.N.Road, Abids, **Hyderabad.**
Ph:040-30720007



హాయ్... సానందంగా...

హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... సన్నిహితులకు **ఆంగ్ల నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు!**

హాస్యానందం ప్రముఖులగురించి ప్రత్యేక సంచిక వెలువరుస్తున్న పరంపరలో ఈ సంచికని శ్రీసత్యమూర్తిగారి కార్టూన్ వైభవంగా తీర్చిదిద్దాము.

శ్రీసత్యమూర్తిగారి 75వ జన్మదిన సందర్భంగా హాస్యానందం ఈ ప్రత్యేక సంచికని ఆయనకు శుభాకాంక్షలతో అందిస్తోంది.

జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ... కష్టనష్టాలని ఓర్చుకుంటూ...పడుతూ...లేస్తూ...'ప్రయాణం' సాగించిన శ్రీసత్యమూర్తిగారు ఈ రోజు యువ కార్టూనిస్టులకు, గ్రాఫిక్ డిజైనర్లకు ఓ 'జంక్షన్' అయ్యారు.

ఆయన జీవితం ఓ పెద్దబాలశిక్ష!... పెరల్సిస్ వచ్చి, బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ అయ్యాక డాక్టర్లు పెదవి విరిచేసినా... గొప్పదైన తమ సంకల్ప బలంతో కోలుకున్నారు. స్వాధీనంలోకి రాని చేతిని తనకు అనుకూలంగా మార్చుకోవడానికి చేసిన ప్రయత్నాలు ఆయన పట్టుదల, పని పట్ల అంకితభావం ఎలాంటివో అర్థమవుతుంది.

చిన్నపిల్లాడిలా 'కాపీ' బుక్కులతో అక్షరాలను ప్రాక్టీస్ చేసారు. తన స్టైల్ బొమ్మలు తయారయ్యే వరకు మొండిగా బొమ్మలు గీసారు. ఎన్నో ఏళ్ళు కష్టపడి తన చేతిని స్వాధీనంలోకి తెచ్చుకుని పట్టుదల, కృషికి మారుపేరుగా 'B' అంటే 'Brave'...'V' అంటే 'Victory' గా బి.వి.సత్యమూర్తిగారు సెకండ్ ఇన్నింగ్ ప్రారంభించారు.

ఆయన పర్‌ఫెక్షన్ కోసం ఎంత శ్రమిస్తారో- స్వయంగా చూసాను నేను. 1987లో గ్రాఫిక్ డిజైనింగ్ ట్రైనింగ్ కోసం నేను ఆయన దగ్గర జాయినయ్యాను. ఒక చిన్న లైన్ కూడా ఎంత షార్ప్‌గా ఉండాలో దగ్గరుండి నేర్పించారు. పని చేస్తున్నప్పుడు ఎవరైనా వచ్చి'బాగుంది' అంటే సీరియస్‌గా 'బాగుంది అంటే ఎదగడం ఆగిపోతుంది.' అనేవారు. ఈ రోజుకీ నేను ఏపని చేస్తున్నా ఆ మాటలనే 'మంత్రం'గా మననం చేసుకుంటుంటాను. థ్యాంక్స్ సత్యమూర్తిగారూ!

ఈ సంచిక చూసి మీ అభిప్రాయాలను తెలియజేస్తారు కదూ? అందరూ హాయిగా...ఆనందగా ఉండాలని కోరుకుంటూ...

-రాము.పి (ఎడిటర్)

*S*mile in Every Page... *S*atisfaction in Every Smile

ఎక్కడ ఏ నవ్వులున్నాయో....





ఈ సంచికలో **మాటలాట**

ప్రముఖ రచయిత **కొనె నాగ వెంకట ఆంజనేయులుగారి** కలం పనితనం!



20,000 రూపాయల బహుమతులు

శ్రీ తలిశెట్టి రామారావు స్మారక కార్టూన్ పోటీలు 2014



తొలి తెలుగు కార్టూనిస్ట్

శ్రీ తలిశెట్టిరామారావు జయంతి

సందర్భంగా హాస్యానందం నిర్వహిస్తున్న
ఈ కార్టూన్ పోటీలో మన కార్టూనిస్ట్‌లు పాల్గొని
విజయవంతం చేయాలని కోరుతూ...

మొదటి బహుమతి	రూ. 5000/-
రెండవ బహుమతి	రూ. 3000/-
మూడవ బహుమతి	రూ. 2000/-
కన్సోలేషన్ బహుమతులు (20)	రూ.500/-

కార్టూన్లు మాకు చేరవలసిన ఆఖరి తేదీ
10, ఏప్రియల్ 2014

శ్రీరామ

చిరంజీవి సత్యమూర్తి నాకు చిరకాల మిత్రుడు

ఆ రోజుల్లో - కొత్త దిగుమతిగా వున్నప్పుడు కోలంకా సరదాతో నింపేవాడు చదువు ప్రావే. ప్రతి తెలుగింటా రేపు రెడీ ఏల మారుమోగేది.

నాకు సత్యమూర్తికీ ఎలాటి ప్రేమాను బంధం ఉంటే ఓ నాటు తన ఆఫీసుకి వెళ్లినప్పుడు - మంచి ఐడియాలు నీకు నిబ్బులు ఎక్కడ దొరుకుతాయి అన్నా. రకరకాల పెన్నులతో నిండిన గ్లాసుని (అదికూడా ఆయన స్వభావం లాగే ఉండంగా వుంది) ముందుకు తోసి - 'మా కిష్టమైనవి తీసుకోండి!' అన్నారు.

సత్యమూర్తి మా సీతారాముడి తమ్ముడంటే నాకూ రమణకీ ఎంత దగ్గరవాడో తెలుస్తుంది

చిరంజీవి సత్యమూర్తి కుటుంబమూ కలకాలం ఆరోగ్యంతో ఆనందంతో వర్ధిల్లాలని శ్రీ సీతారాములను కోరుకుంటూ

బాపు 15.12.13





ఒరిజినల్ గీతలతో
మురిపించెను సత్యమూర్తి,
ముందు తరముకున్
గురువై కార్టూన్ నేర్పిరి
మరిపించిరి వ్యంగ్య చిత్ర
మహితయె వెలగన్!

-బ్నిం



విధిని గెల్చిన నవ్వు అది.

సత్యమూర్తిని మొదటిసారి కలిసి పాతిక సంవత్సరాలైంది.

ఆయన ఫ్రెష్‌నెస్‌తో కూడిన చిరు నవ్వు నాకు ఇప్పటికీ గుర్తుంది. విధిని గెల్చిన నవ్వు అది.

ఆయన బాబాకి గొప్ప భక్తుడు. May baba give him more youthful and peaceful life.

-యండమూరి వీరేంద్రనాథ్

నాకు చిన్నప్పటి నుండి జోకులన్నా కార్టూన్లన్నా ఇష్టం. 10 క్లాసు వచ్చేటప్పటికి అందరి కార్టూనిస్టుల సంతకాలను కాపీ చేసుకొనే వాడ్ని. ఆ క్రమంలో చదువుల్రావు అని ఓ కార్టూన్ సిరీస్ వస్తూండేది. కళ్ళద్దాల్లో చుక్క ఆ బొమ్మ ఇప్పటికీ గుర్తే.

ఆ తరువాత బి.వి. పట్టాభిరామ్‌తో పరిచయం, బి.వి. సత్యమూర్తి గారితో పరిచయం అలా సాగింది.

కార్టూనిస్టుల్లో చాలా హుందా అయిన వ్యక్తి. ఆయనకామధ్య ఒంట్లో బాగో లేదని విన్నాను. అయినా కార్టూన్లు వేయడం మానలేదు ఆయన. ఆ కార్టూన్ పెద్దకి నా నమస్కారం.

-తనికెళ్ల భరణి

"పత్రికలు కార్టూనిస్ట్‌లకి తగిన ప్రోత్సాహం ఇస్తే ఇంకా బాగా రాణించగలరు." -సత్యమూర్తి

అచ్చతెలుగు కార్టూనిస్ట్! ప్రశాంతమైన వదనం...ప్రశాంతంగా పనిచేసే తీరు... పర్‌ఫెక్ట్‌నెస్‌కోసం పడే తపన... చేసే పని కోసం కమిట్‌మెంట్... వెరసి మనందరికి ఇష్టమైన కార్టూనిస్ట్ శ్రీసత్యమూర్తిగారు! ఎంత గంభీరంగా ఉంటారో... తన దగ్గరకు వెళ్ళే వారిని అంతమృదువుగా ఆదరిస్తారు. ఆ వ్యక్తిత్వం నేటి యువతకు ఆదర్శం కావాలి... పనికోసం వెతుక్కోకుండా... పనినే సృష్టించుకుని కార్టూన్లను వ్యాపార ప్రకటనలో గుప్పించి కార్టూన్‌రంగంలో ఓ చరిత్ర సృష్టించి... ఓ కంపెనీని ప్రారంభించి దాన్ని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా ఎదిగించిన మన సత్యమూర్తిగారి మనోభావాలు ఒకసారి పరికిద్దాం!



✦ **మీరు కార్టూనిస్ట్ కావడానికి ఇన్స్పిరేషన్?**

శ్రీబాపుగారే నాకు ఇన్‌స్పిరేషన్. నేను వారికి వీరాభిమానిని.

✦ **ఈ రంగంలో మీకు ప్రోత్సాహాన్నందించినవారు?**

మొట్టమొదట 1956లో రేడియో అన్నయ శ్రీన్యాయపతి రాఘవరావుగారు బాలపత్రికలో కార్టూన్స్, బొమ్మల కథలు, అట్టమీద బొమ్మలు వేయించేవారు. ఆంధ్రసచిత్ర వార పత్రికలో శ్రీశివలెంక రాధాకృష్ణగారు కార్టూన్, కథలకి బొమ్మలు, అట్టమీద బొమ్మలు 'చదువుల్రావు' కార్టూన్స్ వేయించి చాలా ప్రోత్సాహించే వారు. ఆంధ్రప్రభ వీక్లీలో శ్రీపొత్తూరి వెంకటేశ్వరరావుగారు, యువ చక్రపాణిగారు, జ్యోతి రాఘవయ్యగారు, ఆంధ్రభూమిలో శ్రీపండితారాధ్యుల నాగేశ్వరరావుగారు, యం.వి.శాస్త్రిగారు వి.ఎస్.ఎన్.మూర్తిగారు, కనకాంబరరాజుగారు, ఎ.ఎస్.లక్ష్మిగారు, రచనసాయిగారు, విజయబాబుగారు, వేటూరిసుందరరామ్మూర్తి గారు చాల ప్రోత్సాహించారు. ఇంకా మా అన్నయ్యలు శ్రీ బి.వి. రమణారావు, బి.వి.ఎస్.రామారావు(ప్రముఖ రచయితలు) చాలా ప్రోత్సాహాన్నందించారు.

✦ **మీ కార్టూన్‌లు ఓ ప్రత్యేకమైన శైలితో... చూడగానే సత్యమూర్తిగారి కార్టూన్ అని చెప్పేయొచ్చు... దీని వెనకాల మీ కృషి ఎలాంటిది?**

కృషే!

✦ **చాలామంది కార్టూనిస్ట్‌లు ఈ కళ గురించి ఎప్పుడో అప్పుడు నిరుత్సాహంగా మాట్లాడటం వింటూంటాం... మీరలా ఎప్పుడైనా ఫీలయ్యారా?**

1956 నుంచి అన్ని పత్రికలకు కార్టూన్స్ వేసేవాడిని. ఇది బాగుందిరా... దీన్నే కెరీర్ చేసుకోవచ్చని అనుకున్నాను. 67 ప్రాంతంలో నేనొక పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలో మూడేళ్ళు పని



చేసాను. అక్కడ చాలా డర్టీ పాలిటిక్స్ ఉండేవి. ఇమడలేక పోయాను. పైగా అప్పట్లో పత్రికల్లో కొత్తకొత్త వాళ్ళు వచ్చి, వాళ్ళ శిష్యులకి అవకాశాలిచ్చారు. అది బాగానే ఉంది కానీ, నేను కెరీర్ చేసుకుంటే ఇప్పట్లో బతుకుతెరువుకి ఇది చాలా కష్టం అని మా కంపెనీలో నాకు పరిచయమైన 'గ్రాఫిక్ డిజైనింగ్' చేస్తూ భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి బ్లెసింగ్స్‌తో 'శ్రీసత్యసాయి డిజైనింగ్ స్టూడియోస్ ప్రారంభించి, ఇప్పుడు విజయవంతంగా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా చేయ గలిగినది అంటే అది భగవాన్ శ్రీసత్యసాయిబాబా వారి అనుగ్రహం వలననే.

✦ **ప్రకటనరంగంలో కార్టూన్లతో ఓ కొత్తఒరవడిసృష్టించి ఎందరికో మార్గదర్శకమయిన మీరు ఆ ప్రక్రియకు నాంది పలకడానికి ఏమైనా కారణాలున్నాయా ?**

నాకు కార్టూన్లు వేసే అనుభవం ఉంది కనుక కమర్షియల్ వర్క్‌లో ఇన్‌ఫెన్‌టోన్ గ్రిప్ వాటర్‌కి, నాగార్జున సిమెంట్స్‌కి, విష్ణు సిమెంట్స్ మొదలైన కంపెనీలకి, పోలీస్ వెల్‌ఫేర్ ఫండ్ ప్రకటనలకి, కొన్ని సినిమాప్రకటనలకి బి.హెచ్.ఎల్, క్వాలిటీ మీద, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలుగు క్యాలెండర్లలో కార్టూన్లు వాడాను. ఫామిలీ ప్లానింగ్ కార్టూన్లు వేసాను.

✦ **ఇంకా మీరు ఈ కార్టూన్ కళతో ఎన్నెన్ని ప్రయోగాలు చేసారో కాస్త వివరిస్తారా?**

ప్రకటనలకే కాకుండా కొన్ని మెడికల్ కంపెనీల విజువల్ ఎయిడ్స్, క్యాప్ కవర్, బ్రోచర్‌లోనూ, కొన్ని సీడ్ గ్రోయర్ కంపెనీలకు, వాల్ పోస్టర్లలోనూ, పాయింట్ ఆఫ్ పర్చేస్ డిజైన్‌లోనూ, డైరెక్ట్ మెయిలర్స్, గ్రీటింగ్ కార్డుల మీద కార్టూన్లు వేసాను. ఫ్యామిలీ వెల్‌ఫేర్ వారి గర్ల్ చైల్డ్ విద్య, ఆరోగ్యం, పెళ్ళి వయస్సుల మీద బొమ్మల కథలతో పుస్తకాలు వేసాను. బంగారునంది గెలుచుకున్న'సుడిగుండాలు చిత్రానికి 'ఆర్ట్ డైరెక్టర్'గా చేసాను.

✦ **మీ దగ్గర డిజైనింగ్‌గానీ, కార్టూన్లుగానీ నేర్చుకుని మిమ్మల్ని మెప్పించిన వారి పేర్లు చెప్తారా?**

గ్రాఫిక్ డిజైనింగ్‌లో రాముగారు, దుర్గాప్రసాద్, ప్రసాద్, షకీల్‌అహ్మద్, గోపి మున్నగువారు ఇప్పుడు మంచి స్థితిలో ఉన్నారు.

✦ **ఇక మీ వ్యక్తిగత జీవితం గురించి చెప్పండి!**

మా నాన్నగారు రావుసాహెబ్ భావరాజు సత్యనారాయణ గారు, చార్టెర్డ్ ఇంజనీర్....





మా అమ్మగారు శ్రీమతి వెంకాయమ్మగారు. మాది కాకినాడ. నా భార్య జోగేశ్వరి, మంచి పెయింటర్. చాలా పత్రికల్లో బొమ్మలు ప్రచురింపబడ్డాయి. గ్రాఫిక్స్‌డిజైన్ కూడా నాతోపాటు చేసేది. మా అమ్మాయి డా॥శ్రీపద్మావతి, సెంట్రల్ యూని వర్సిటీలో ప్రొఫెసర్. మా అబ్బాయి సత్యసాయి భాస్కర్, బి.కామ్., ఎమ్.బి.ఎ. ఇప్పుడు శ్రీసత్యసాయి డిజైనింగ్ స్టూడియో ప్రై.లి. మేనేజింగ్ డైరెక్టర్.

✦ ప్రస్తుతం ప్రముఖ తెలుగు పత్రికలు ఒకో పత్రిక ఒకో కార్టూనిస్టుల కార్టూన్లే ప్రచురిస్తున్నారు... దీనిపై మీ విశ్లేషణ?

అది వాళ్ళిష్టం!... కార్టూనిస్ట్ యొక్క ప్రతిభ.

✦ ఇప్పుడు తెలుగు కార్టూన్‌ల,కార్టూనిస్టుల పరిస్థితి ఏమిటి?

ఇప్పుడు ప్రతిభ ఉన్న కార్టూనిస్టులకి యానిమేషన్ రంగంలో మంచి అవకాశాలు, ప్రోత్సాహం ఉన్నాయి. వార్తా పత్రికల్లో పొలిటికల్ కార్టూనిస్టులకి మంచి అవకాశాలు ఇస్తున్నారు. పత్రికలు కార్టూనిస్టులకి తగిన ప్రోత్సాహం ఇస్తే ఇంకా బాగా రాణించగలరు. ముఖ్యంగా కొత్తగా వస్తున్న కార్టూనిస్టులకి 'వర్క్‌షాప్‌లు' పెట్టి వారికి తగిన గైడెన్స్ ఇస్తే బాగుంటుంది.

✦ పొలిటికల్ కార్టూనిస్టులనీ...సోషల్‌కార్టూనిస్టులనీ 'ఫోరం'లు ఏర్పాటు చేసుకుని ఎవరికి వారు విడివిడిగా కార్యాచరణలు ఏర్పరచుకోవటం మంచిదేనా?

కానీ ఇద్దరు కలిసి ఎన్నో కార్యాక్రమాలు నిర్వహించారు కదా?

✦ ఏ ఏ భాషల్లో మీ కార్టూన్లు ప్రచురించబడ్డాయి?

పత్రికలో తెలుగు,స్టైలైన్ న్యూస్ పేపర్‌లో పొలిటికల్ కార్టూన్స్, బి.హెచ్.ఇ.ఎల్ లో క్వాలిటీ కార్టూన్స్, ఎస్.బి.ఐ. ఐ.సి.ఎమ్. వారి జర్నల్ లో ఇంగ్లీష్ కార్టూన్స్, స్ట్రిప్ కార్టూన్స్, ఆంధ్రప్రదేశ్ పత్రికలో ఉర్దూ కార్టూన్లు వచ్చాయి.

✦ మీకొచ్చిన అవార్డులు రివార్డుల గురించి...?

ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖసాంస్కృతిక సంస్థలనుండి చాలా అవార్డులు అందుకున్నాను. ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడమీకి 5సంవత్సరాలు కౌన్సిల్ మెంబర్‌గా ఉన్నాను. హీరో నాగేశ్వరరావుగారి చేతులమీదుగా ఉగాది పురస్కార్ అవార్డ్, ఢిల్లీ ఎ.పి.భవన్‌లో శ్రీపి.వి.నరసింహరావుగారి చేతుల మీదుగా, ఎ.పి.జర్నలిస్టుల ఫోరం అవార్డు శ్రీ బాపుగారి చేతుల మీదుగా వచ్చాయి. బాలానందం సంఘంలో శ్రీరమణాచారి గారి ద్వారా సన్మానం. 1982లోఆంధ్రప్రదేశ్ ఉగాది పురస్కారం అవార్డు అప్పటిముఖ్యమంత్రి శ్రీనందమూరి తారక రామారావు చేతులమీదుగా; 1986లో 'వంశీ బర్కిలి బెస్ట్ కార్టూనిస్ట్ అవార్డు; 1977లో ఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం; ఢిల్లీ తెలుగుసంఘం 24వ వార్షికోత్సవం సందర్భంగా 2002లో ఢిల్లీ తెలుగుసంఘం అవార్డు; 2002లో ఎ.పి.ప్రెస్ అకాడమీ అవార్డు, ఇంకా ఖమ్మం కళా పరిషత్, ఢిల్లీలో, విశాఖపట్టణంలో వివిధ సంస్థలలో సన్మానం.

✦ యువ కార్టూనిస్టులకు మీరిచ్చే సలహా?

పట్టుదల కృషి ఉండాలి. ఎదిగిన కొలది ఒదిగి ఉండాలి.

✦ హాస్యానందంపై మీ అభిప్రాయం?

మా అందరికి అభిమాన పత్రిక హాస్యానందం! మా అందరి ఆరోగ్యానికి కారణం హాస్యానందం!

✦ మీకు తీరని కోరికలేమైనా ఉన్నాయా?


శ్రీ బాపుగారి బొమ్మలో వందోవంతునైనా బాగా వెయ్యగలగాలని నా తాపత్రయం. ఐనా నేను రాక్ బాటమ్ లెవెల్లో ఉన్నాననే నా ఉద్దేశం. నా ఫొటో ఇచ్చి నా బొమ్మ వేయమని అడగాలని నా మనసులో ఉండేది. కానీ అందపెద్దాయన్నీ వేస్తారా అని అడగడం భయం. పైగా నా బ్రెయిన్‌ట్యూమర్ ఆపరేషన్ వల్ల నా మూతి వంకరయింది. ఇలాంటి ఫోటో పంపిస్తే బాగుండదని, దిష్టిబొమ్మల ఉంటుందేమోనని పంపలేదు. ఇప్పుడేం చేయాలా అని ఆలోచిస్తున్నాను.

శ్రీసత్యనారాయణగారి సౌజన్యంతో

క్వైట్ ఫన్!

జనవరి విజేతలు

ఈ శీర్షికలో పాల్గొన్న కార్టూనిస్ట్ అందరికీ అభినందనలు! మన తెలుగు కార్టూనిస్ట్‌లు 'క్యాప్షన్‌లెస్ కార్టూన్ల'లో అగ్రగామీలవ్వాలనే సదుద్దేశంతో మొదలయినదీ వేదిక! మరిన్ని మంచి మంచి కార్టూన్లు వేయడానికి ఈ 'క్వైట్‌ఫన్' స్ఫూర్తినివ్వాలని మా ఆకాంక్ష! -ఎడిటర్



మొదటి బహుమతి రూ.500/-లు పొందిన కార్టూన్

రెండవ బహుమతి రూ.300/-లు పొందిన కార్టూన్



మూడవ బహుమతి రూ.200/-లు పొందిన కార్టూన్



హాస్యానందంలో
క్యాప్షన్‌లెస్ కార్టూన్‌లకు ప్రతినెలా బహుమతులు
ప్రతీ నెలా 15వ తేదీలోగా
మీ కార్టూన్లు మాకు చేరేలా పంపించండి!

మొదటి బహుమతి- **రూ.500/-లు**
రెండవ బహుమతి- **రూ.300/-లు**
మూడవ బహుమతి- **రూ.200/-లు**

మీ కార్టూన్లు ఈ మెయిల్ కి మెయిల్ కూడా చేయవచ్చు- quitefun.hasyanandam@gmail.com

మల్లిక్ కామెడీ కథలు



డ్రగ్స్... డ్రగ్స్... డ్రగ్స్...

"క....య్యి...." పెద్ద కేక!

జానకిరాం ఉలిక్కిపడి చేతిలోని కాఫీకప్పు వదిలేశాడు. కప్పు నేలమీద పడి పగిలిపోయి కాఫీ అంతా వొలికిపోయింది.

జానకిరాం తలెత్తి ఎదురుగా చూశాడు.

చిట్టితల్లి నోరంతా తెరిచి ఏడుస్తుంది.

"క... హెయ్..."

"అబ్బబ్బ... ఏంటే ఆ ఏడుపు? డబల్ గ్యాస్ సోడా కొట్టినట్టు...కాస్త నోరుముయీ..." అన్నాడు జానకిరాం కసురుకుంటూ.

ఇంతలోకి అతని భార్య మాణిక్యం పరిగెత్తుకుని హాల్లోకి వచ్చింది.

"ఏంటండీ! చంటిదాన్ని ఏం చేశారు అంత చేటున ఏడుస్తుంది?" అడిగింది.

"ఏమో... నాకేం తెలుసూ?... అది ఉన్నట్టుండి రాగం అందుకుంది..."

"ఏంటమ్మా... ఏమైంది?... ఎందుకేడుస్తున్నావ్?" అనునయంగా అడిగింది మాణిక్యం.

తల్లి అలా ప్రేమగా అడిగేసరికి చిట్టితల్లి దుఃఖం ఇంకా పొంగుకొచ్చి మరీ గట్టిగా ఏడ్చింది.

"కహి...య్..."

ఆ దెబ్బకి మాణిక్యం కొప్పు ఊడిపోయింది.

అది చూసి జానకిరాం కిసుక్కున నవ్వాడు.

"ఎందుకలా పిచ్చిపుల్లాయ్‌లా నవ్వుతారు, దాన్ని ఏడ్పించింది కాకుండా?" రుసరుస చూస్తూ అంది మాణిక్యం.

"అయ్యో రాత... నేనెక్కడ ఏడ్పించానే... దానంతట అదే ఏడుస్తుంది!..." నెత్తి కొట్టుకున్నాడు జానకిరాం.

"ఎందుకమ్మా ఏడుస్తున్నావ్... నాన్నారు నిన్ను ఏడిపించారా?"

"ఊ" అవునన్నట్టు తల ఊపింది చిట్టి తల్లి.

"చూశారా! మీరే దాన్ని ఏడ్పించారట!..."

"అయ్యో...నేను ఏడ్పించలేదే బాబూ..." మొత్తుకున్నాడు జానకిరాం.

"నేను నిన్ను ఎప్పుడు ఏడ్పించానే అయ్..." అన్నాడు చిట్టితల్లితో.



"క....య్.." ఇప్పుడు త్రిబుల్ గ్యాస్ సోడా కొట్టినట్టు ఏడ్చింది.

"చిన్న పిల్లల్ని బుజ్జగిస్తూ అడగాలిగానీ అలా కసురుకుంటూ అడుగుతారా ఎక్కడైనా? సరిగ్గా అడగండి.." బుగ్గమీద పోటు పొడుస్తూ అంది మాణిక్యం.

జానకిరాం బుగ్గ రుద్దుకున్నాడు.

"చూడు చిట్టితల్లీ.., బుజ్జికన్నా... చిన్ని ముండా... చిచ్చీ. నేన్నిన్ను ఏడిపించానా?..." చిట్టి తల్లిని ఇలా ప్రశ్నించాడు.

చిట్టితల్లి కళ్లు తుడ్చుకుని ముక్కుని చిర్రుబుర్రులాడించి" ఏడ్పించలేదా మరి?... ఇప్పుడేగా బఠానీలు నాకు పెట్టకుండా తిన్నావ్?..." అంది.

"బఠానీలా?... నేనా? నేనెక్కడ తిన్నాను?"

"తిన్నావ్!... కాఫీ తాగేముందు బఠానీలు తిన్లేదూ?..." బుంగమూతి పెట్టింది.

జానకిరాం ఫక్కుమని నవ్వాడు.

"అయ్యోతల్లీ... అవి బఠానీలు కాదే.... మాత్రలు... మాత్రలేస్కున్నా... హిహి..."

"ఆ.... ఆ... మాత్రలెవరయినా అన్ని ఏసుకుంటారా?...ఖ...య్..."

"ఏంటీ? ఇంతకీ మీరు బఠానీలు తిన్నారా? మాత్రలేస్కున్నారా?..." కసుర్తూ అడిగింది మాణిక్యం.

"బఠానీలెందుకు తింటానే! నేను మాత్రలే వేస్కున్నా..." బిక్కమొహం వేశాడు జానకిరాం.

చిట్టితల్లి మరికాస్త స్వరం పెంచింది.

"ఖహి...య్..."

"పాడుగోల... మీరు మాత్రలు మింగే ముందు కాస్త దానికి చూపించి మింగ రాదూ? ఈ గోల ఉండేదికాదు!... అయినా బఠానీల్లా అన్ని మాత్రలు ఎందుకు మింగారు?"

"నాకు జలుబూ ఒళ్లు నొప్పులుగా ఉంటే ఇందాక డాక్టరు దగ్గరికెళ్లాను. డాక్టరుగారు మాత్రలు రాసిచ్చారు!"

"ఏమిటీ?.. అన్ని మాత్రలా?" ఆశ్చర్యంగా అడిగింది.

"అవును... ఒకటేమో జలుబు మాత్ర, ఒహాటేమో నడ్డినొప్పి మాత్ర.. ఇంకోటేమో విటమిన్ 'సి' మాత్ర, మరొహాటేమో ఏంటీ బయోటిక్, ఇంకోటేమో బి కాంప్లెక్స్ మాత్ర... అన్నీ

మూడు పూటలూ వేస్కోమన్నాడు డాక్టరు!..."

"మీ మొహం... ప్రతి చిన్నదానికీ డాక్టరు దగ్గరికి పరుగులేస్తారు... మిగతా మాత్రలు బయటికి తీసి దానికి చూపించండి..."

జానకిరాం మిగతా మాత్రలు చిట్టితల్లికి చూపించి తను అవే మింగినట్టు దానికి నచ్చ జెప్పి ఏడుపు ఆపించాడు.

మాణిక్యం చిట్టితల్లిని ఏడ్పించినందుకు అరడజను చీవాట్లూ, అన్ని రకాల మందులు మింగుతున్నందుకు డజను చీవాట్లూ, కాఫీని నేలమీద ఒంపినందుకు రెండు డజన్ల చీవాట్లు భర్తని వేసింది.

"దేభ్యం మొహం వేస్కుని అలా చూస్తారేం? ముందు నేలమీద పడేసిన కాఫీని కడిగి శుభ్రం చేయండి..." చీవాట్లు అయ్యాక కసిరింది.

జానకిరాం వచ్చినట్టు కాఫీ కడిగాడు.

రాత్రి భోజనం దగ్గర జానకిరాం వంక చూసిన మాణిక్యం ఆశ్చర్యంతో నోటిని పెద్దగా తెరిచింది.

"ఎందుకలా చూస్తావ్?... నేను కొద్దిగానే తింటున్నానే!..." అడిగాడు జానకిరాం.

"అదికాదు... మీ బుర్రకాయ్ ఏంటి అట్టా వాచిపోయింది?" అంది మాణిక్యం.

"వాయదామరి?.. ఇందాక తలవాచేలా చివాట్లు పెట్టావుగా?!" బుంగమూతిపెట్టాడు జానకిరాం.

"మీ బొంద... ఈ వాపు వేరేగా ఉంది. నేను తిడ్తే మీ డిప్పకాయ్ ఒక్కటే వాస్తుంది. ఇప్పుడేమో మొహం కూడా బూరెలాపొంగి ఉంది. ఎందుకైనా మంచిది డాక్టరుగారి దగ్గరకు వెళ్లిరండి..." అంది మాణిక్యం.

"హమ్మా... ఆశ, దోశ, అప్పడం, వడ... నేను డాక్టరు దగ్గరికెళ్తానంటే నా డిప్ప వాచేలా మళ్లీ చివాట్లు పెడ్దామనా?... హమ్మా..."

"నోర్మూస్కుని డాక్టరు దగ్గరికెళ్లండి... లేకపోతే డిప్పకాయగొడ్తా." అరిచింది మాణిక్యం.

జానకిరాం అలాగే అన్నట్టు బుర్రూపాడు.

డాక్టర్ జానకిరాంని చూస్తూనే ఫక్కుమని నవ్వాడు.

"అదేంటిసార్! హెల్మెట్ పెట్టుకోక పోయినా హెల్మెట్ పెట్టుకున్నంత లావుగా ఉంది మీ తలకాయ్? హి...!" అన్నాడు ఆనందాశ్చర్యాలతో.

"ఏమోసార్!... మీర్రాసిన మందులు మింగాను. అంతే! తలిట్టా వాచి పోయింది!" దీనంగా అన్నాడు జానకిరాం.


"అంతేనా?... మీ ఆవిడ ఝుమ్‌కు ఝుమా అని తలవాచేలా చీవాట్లు పెట్టలేదా?.." నవ్వాపుకుంటూ అడిగాడు డాక్టర్.

"లేదు సార్..."

అంతే... డాక్టరు మొహం సీరియస్‌గా మారిపోయింది.

ఓసారి క్లినిక్ సీలింగ్ వంక సీరియస్‌గా







చూసి, ముక్కుపొంగించి-

"డ్రగ్ రియాక్షన్... మీ దిప్పకాయ్ డ్రగ్స్ రియాక్షన్ వల్ల వాచింది. మీరు వాడుతున్న మాత్రల్లో ఏదో మీకు పడ్లేదు... ప్రస్తుతం అవన్నీ మానేయండి... వేరే మాత్రలు రాసిస్తాను... రియాక్షన్ తగ్గడానికి ఇంజక్షన్ ఇస్తాను..."

అలాగేనన్నట్లు దిప్పకాయ్‌ని ఐరువుగా ఊపాడు జానకిరాం.

డాక్టరు చేత ఇంజక్షను చేయించుకుని అతను రాసిచ్చిన మాత్రలు కొనుక్కుని ఇంటికి వెళ్లాడు.

రాత్రి మాత్రలు వేసుకుని పడుకున్నాడు.

మర్నాడు ఉదయం...

"ఏంటి?... చేతులకు గ్లవ్స్ వేస్కున్నారు. నాతో బాక్సింగ్ చేద్దామనా?... పిచ్చి కళలు పోయారంటే పీకి పాకం పట్టేస్తా." అంది మాణిక్యం.

జానకిరాం లబలబ నోరు కొట్టుకున్నాడు.

"హయ్యొరాత!... నేను చేతులకి గ్లవ్స్ ఎక్కడ వేస్కున్నానే బాబూ?!"

"హో!... మరి మీ అరచేతులేంటి అంత లావుగా ఉన్నాయ్?" కళ్లు పెద్దవి చేసి అడిగింది మాణిక్యం.

జానకిరాం తన చేతుల వంక చూస్కుని ఘొల్లుమన్నాడు.

"ఓర్నాయనోవ్... నా వేళ్లేంటి రూళ్ల కర్రల్లా ఇట్టా లావుగా ఉన్నాయ్!!..."

"ఏంపాడో ఏంటో... దిప్పవాపు తగ్గి చేతులు లావుగా వాచిపోయాయ్... మళ్లీ రియాక్షన్ ఏటో?..." అంది మాణిక్యం.

జానకిరాం మళ్లీ డాక్టరు దగ్గరికి పరుగు తీశాడు. కానీ ఆ క్లినిక్ మూసి ఉంది. అంచేత కాలనీలోనే మరోడాక్టరు దగ్గరికి వెళ్లాడు జానకిరాం.

"ఇది సెంట్‌పర్సెంట్ డ్రగ్ రియాక్షనండీ.. అయినా అక్కడికి ఎందుకెళ్లారండీ బాబూ... అతనికేం చేతకాదు..." అన్నాడు ఆ డాక్టరు.

మళ్లీ రియాక్షన్ గురించి ఆ డాక్టరు దగ్గర ఇంజక్షన్ తీస్కుని అతను రాసిన మందులు కొనుక్కుని ఇంటికెళ్లాడు.

ఆ మర్నాడు అతని చేతి వాపులు తగ్గాయి గానీ కాళ్లనుండీ, చేతులనుండీ పొలుసులాగా చర్మం ఊడి రాసాగింది.

జానకిరాం లబలబమంటూ డాక్టర్ దగ్గరికి పరుగు తీశాడు.

"ఏంటండోయ్... మీది నాగవంశమా?... పాములా కుబుసం విడుస్తున్నారు?.." చర్మాన్ని పరీక్షగా చూసి పకపకా నవ్వాడు డాక్టర్.

"చాల్లెండి సార్ సరసం... నిన్న మీర్రాసిన మందులు వాడితే ఇట్టాగయింది... ఆ డాక్టరు దగ్గరికెళ్లొద్దని అన్నారు. మీర్రాసిన మందుల వల్ల కూడా ఇలాగయ్యిందేం? అన్నాడు జానకిరాం ఏడుపు మొహం పెట్టి.

దాంతో ఆ డాక్టరు ఇంతెత్తున లేచాడు-

"నా వైద్యానికే వంకలుపెడ్తావా!నువ్వేం కల్తీ మందు లు కొనుక్కుని మింగావో ఏమో!" అన్నాడు.

జానకిరాం మందుల షాపులో ఎంక్వయిరీ చేశాడు... "సార్...! మరేమో మీ షాపులో కల్తీ మందులు గానీ అమ్ముతారా?" అని.

వెంటనే షాపువాడు జానకిరాం మెడపట్టి గెంటించేశాడు.

"అయినా ప్రతి చిన్నదానికీ అడ్డమైన మందులూ ఎవడు మింగమన్నాడూ?..." అంటూ అతను యింటికి వెళ్లిం తర్వాత మాణిక్యం బుగ్గమీద పొడిచింది. అప్పట్నుంచి అతను చీటికీ మాటికీ, ప్రతి చిన్న దానికీ మందుల్ని మింగడం మానేశాడు.



సత్యమూర్తి-కార్టూనిస్ట్



కార్టూనిస్ట్ సత్యమూర్తిగారితో నాకు ఎన్నో సంవత్సరాలుగా పరిచయం ఉంది.

ఆయన నాకంటే చాల సీనియర్ కార్టూనిస్ట్ అయినా... నేను సీనియర్‌ని, మల్లిక్ జూనియర్ అనే 'ఈగో' లేకుండా మా ఇంటికి వచ్చేవారు.

నాకు డ్రాయింగ్ పెన్స్ గురించి అంతగా తెలియనప్పుడు తన దగ్గర ఉన్న అన్ని రకాల పెన్నులూ... బ్రష్‌లూ నాకు చూపించి... ఏవేవి ఎక్కడ దొరుకుతాయో చెప్పారు... అఫ్‌కోర్స్ వేరే సీనియర్స్‌ని నేను అడిగినా చెప్పకుండా దాటేశారనుకోండి... అది వేరే విషయం.

పైకొచ్చే వాడు ఎలాగైనా వచ్చి చస్తాడు.... రాలేని వాడు ఏం చేసినా పైకిరాడు.

సత్యమూర్తిగారు కార్టూనిస్ట్ అని మాత్రమే అందరికీ తెలుసు... కానీ ఆయన పెద్ద కమర్షియల్ ఆర్టిస్ట్ అని చాలా మందికి తెలీదు. సత్యమూర్తిగారి కార్టూన్ ఫీచర్స్‌లో నాకు 'చదువు(లావు' అంటే చాలా ఇష్టం.

ఆయన కార్టూనుల్లో వైవిధ్యం కనిపిస్తుంది.... గీతల్లో కూడా వెరైటీ ఉంటుంది.

నేను 1994 దాకా విజయనగర్‌కాలనీ దగ్గర పి.ఎస్.నగర్‌లో ఉండేవాడిని. ఆయన మా ఇంటికి దగ్గర్లోనే ఉండేవారు. అప్పుడు మేమిద్దరం అడపా దడపా కలిసేవారం.

సత్యమూర్తిగారు ఇలాంటి పుట్టిన రోజులు ఎన్నెన్నో చేస్కోవాలనీ... జీవితాంతం ఆయన కార్టూన్లు వేస్తూనే ఉండాలనీ నేను ఆశిస్తున్నాను.

ఆయన పుట్టినరోజు సందర్భంగా హాస్యానందం ఆయన ప్రత్యేక సంచికగా వెలువరిస్తున్నందుకు రాముగారిని అభినందిస్తున్నాను.

-మల్లిక్

జంధ్యాల 'పెన్'ఛి... పెద్ద చేసిన...

మల్లె పందిరి

డా॥ దివాకర్ చేసిన
వెండితెర నవ్వులీకరణ



హాస్యబ్రహ్మ జంధ్యాల...

ఈ పేరు తెలియని హాస్యప్రియులు ఉండరనేది ఎంత సత్యమో... ఆయన కురిపించిన నవ్వుల జడివానలో తడిసి పొట్టచెక్కలయేటట్లు నవ్వని హాస్యప్రియులు కూడా ఉండరనేది అంతే సత్యం!

శ్రీజంధ్యాల గారు **1951** జనవరి **14**వ తేదీన నర్సాపురంలో జన్మించారు. చదువుకునే రోజుల్లోనే హాస్యనాటకాలతో తన హాస్యప్రియత్వాన్ని చాటుకున్నారు. చిత్ర సీమలో మాటల రచయితగా అడుగుపెట్టి తెలుగులో ఎన్నో మాటల గారడీలు చేస్తూ నవ్వుల పూతతోనే సినిమాలకు దర్శకత్వం వహించారు. ఆయన దర్శకత్వం వహించిన రెండవ చిత్రమే ఈ 'నవ్వుల పందిరి'- మల్లె పందిరి! ఆయన జయంతి సందర్భంగా హాస్యానందం సగర్వంగా సమర్పిస్తోందీ ధారావాహికను.

అద్దమైనతిరుగుళ్ళూ తిరుగుతూనే వుంది భూగోళం.


నిన్న 'సన్' దెవేళ అమెరికా పడమటొడ్డున్న ఆకాశం- పసిఫిక్‌ని సెన్సార్షయం లేకుండా ముద్దులు పెట్టేసుకుంటున్న చోట, 'కూల్' బడి కునికిన సూర్యుడు-అంతలోనే 'డ్యూటీ' గుర్తొచ్చి ఆదరా బాదరా అ కోటూ బూటూ తీసేసి-ఎర్రపంచె కట్టుకుని, ఈ అంచుకు పరుగెట్టుకొచ్చిడు.

వచ్చాడేగాని, ఇక్కడ 'రిసెప్షన్' ఏం బాగోలేదు.

పవనాలు భూపాలం పాడలేదు. కోడి కొక్కొరొక్కొంతైనా లెక్క చెయ్య లేదు. తామర పిల్లరేకుల్తలుపు తియ్యవేలేదు. దాహమేసి గోదారొడ్డుకొస్తే అక్కడ రెండు దోసిళ్ళ మంచినీళ్ళు ముట్టలేదు సరికదా, నాలుగు నమస్కార నాష్టాలయినా దొరకలేదు.

ఎవ్రిడే ఈజ్ నాట్ 'సన్'డే- అని కాస్త సరిపెట్టుకుని ఉసూరు మంటూ ఓ నాలుగిళ్ళ చావిడికేసి నడిచి, యథాలాపంగా తలెత్తి కిటికీలోంచి చూస్తే - పైకి తన్ని పెట్టి, తననే వెక్కిరిస్తున్నట్టున్న రెండు వెదురు బొంగుల్లాంటి కాళ్ళు కనిపించాయి!





'ఇన్‌సల్ట్' భరించలేక మబ్బుల కోసం ఇంకాస్త పైకి పరిగెత్తాడు బాలసూరీడు. (ఆ ఆహ్వానం తాలూక కథ ఏమిటో తెలుసుకో వాలంటే వచ్చే సంచిక వరకు ఆగాల్సిందే)



కండ్లకుంట శరత్‌చంద్ర

హాస్యచంద్ర 001



అందరూ భోజనం చేస్తూనే రింగు ఎక్కడైనా పడిపోయిందేమోనని వెతక సాగారు. తమాషా ఏంటంటే ఆ రింగు తీసిన దొంగ కూడా నలుగురితో నారాయణ అన్నట్లు నేల చూపులు చూడసాగాడు.

"ఎవరినీ అవమానించొద్దని చెప్పానుగా. ఇప్పుడు మీ రాము ఒక్కొక్కరినీ సోదా చేసి మరీ బయిటకు పంపుతాడా?!!" మెల్లిగా హాస్యచంద్రను అడిగాడు పీతాంబరం.

"సర్! మీరు మా క్లయింటు. మా మాటను గౌరవించడం మా విధి. ఎవ్వరినీ అవమానించం. మీ రింగు మీకు దొరుకుతుంది" ప్రశాంతంగా అన్నాడు హాస్యచంద్ర.

ఆ తర్వాత ఒకక్కరూ తిని వెళ్ళిపోయేందుకు సిద్ధమవసాగారు.

హాస్యచంద్ర మళ్ళీ వేదికనెక్కి- "రామూ! ఇప్పుడు నువ్వెళ్ళి క్రింద మెట్లు దగ్గర నిల్చో" చెప్పాడు.

రాము చేతులు కడుక్కుని, ఆ హాల్లో నుండి బయటకు వెళ్ళి మెట్లు దిగి క్రింద నిల్చున్నాడు.

"కొంపదీసి ఇప్పుడు మనల్ని చెక్ చేస్తారా!"

"పార్టీకి పిలిచి ఇలా అవమానిస్తారా!"

"దొంగెవరో దొరికే దాకా అందరినీ సోదా చేయక తప్పదు కదా!"

"అయినా నాకేం భయం! నేనేం దొంగను కానుగా."

"దొంగ లేదు. గింగా లేదు... అదిడే ఎక్కడో పడేసుకునుంటుంది".

ఇలా అతిథులు రకరకాలుగా మాట్లాడుకో సాగారు. ఆ తర్వాత ఒక్కొక్కరు పీతాంబరానికి గుడ్‌బై చెప్పి వెళ్ళిపోసాగారు.

అయితే వారు ఊహించుకున్నట్లుగా, రాము ఎవ్వరినీ చెక్ చేయలేదు. మెట్ల దగ్గర నిలబడి సెల్‌ఫోన్‌లో రమ్యతో మాట్లాడు తున్నాడు. అరగంటలో అతిథులందరూ వెళ్ళిపోయారు.

రాము హాల్‌లోకి వచ్చాడు.

పీతాంబరం దంపతులు, హాస్యచంద్ర, సమత, రాము మాత్రమే అక్కడున్నారు.

"సమత నువ్వు కూడా ఇంటికి వెళ్ళిపో!" చెప్పాడు హాస్యచంద్ర.

"నాకు ఇంటికి వెళ్ళాలంటే భయంగా ఉంది." అంది.

"మరీ ఎక్కువగా భయపడకు ఈ రోజో, రేపో విషయం మీ ఇంట్లో తెలవాల్సిందే. ఇంటికి వెళ్ళు."

ఆమె మారు మాట్లాడకుండా వెళ్ళి పోయింద.

"అందరూ వెళ్ళిపోయారు. మీరెవ్వరినీ సోదా చేయలేదు. మరి డైమండ్ రింగ్ ఏమై నట్టు." ఆత్రంగా అడిగాడు పీతాంబరం.

హాస్యచంద్ర నవ్వి, హోటల స్టాఫ్‌ను పిలిచి రెండు జతల గ్లౌస్‌లు తెమ్మని చెప్పాడు.

స్టాఫ్ రెండు జతల పాలథీన్ గ్లౌస్ తెచ్చి హాస్యచంద్రకిచ్చారు.

హాస్యచంద్ర, రాము వాటిని తొడుక్కున్నారు.

హాస్యచంద్ర ఒక మూలగా వుంచిన భారీ చెత్త కవర్‌ను సమీపించి దాన్ని బోర్లించాడు.

అతడేం చేస్తున్నాడో పీతాంబరానికి అర్థం కాలేదు. డైమండ్ రింగ్ పోయిన విషయం తెలియడంతో హోటల్ స్టాఫ్ కూడా మౌనంగా చూడసాగారు.

జరిగిన కథ: హాస్యచంద్ర ఓ ప్రైవేట్ డిటెక్టివ్. ఒక పెద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లో భార్య తప్పిపోతే కంగారు పడుతున్న ఒకతనికి మాస్టర్‌ప్లాన్ వేసి అతని భార్య అక్కడికి చేరుకునేట్లు చేస్తాడు హాస్యచంద్ర. ఈ సంఘటన చూసిన చాలామంది హాస్యచంద్ర ఫోన్ నెంబరు తీసుకుంటారు. ప్రహేళికారావు- తన కూతురు వెంట ప్రేమిస్తున్నామంటూ ఎవరైనా పడుతున్నారా కనిపెట్టమని హాస్యచంద్రకు ఫోన్ చేస్తాడు. ఆ కుర్రాల లిస్ట్ తీసుకొచ్చి ప్రహేళికారావుకిస్తాడు హాస్యచంద్ర. ఆ కుర్రాలను పిలిపించి వారందరిచేత తన ఇంట్లో నానా రకాల చాకిరి చేయిస్తాడు. వారందరికీ ఓ పరీక్ష కూడా పెడతాడు.

హాస్యచంద్ర, రాము చెత్తకు చెరోవైపు కూర్చుని ప్రశాంతంగా వెతకసాగారు.

అప్పటివరకు జరిగిన డిన్నర్‌లో అతిథులు తమతమ ప్లేట్లలో మిగిల్చిన అన్నం మెతుకులు, మంచూరియా ముక్కలూ, మిరపకాయ బజ్జీలు, బిర్యానీ మెతుకులు, గులాబ్‌జామ్‌ల, పన్నీర్ ముక్కలు ... ఇలా అన్నీ కెలుకుతూ వెతకసాగారు.

"గాట్ ఇట్!!" అన్నాడు హాస్యచంద్ర తన చేతిలో ఉన్న మిరపకాయబజ్జీ వంక చూస్తూ.

పీతాంబరం దంపతులు ఆశ్చర్యంగా నోళ్ళు వెళ్ళబెట్టుకొని చూసారు.

హాస్యచంద్ర మిరపకాయ బజ్జీ నుండి వాష్ బేసిన్ దగ్గరకు వెళ్ళి దాన్ని తన చేతులను శుభ్రంగా కడుక్కొని తీసుకొచ్చి ఉంగరాన్ని పీతాంబరానికి ఇచ్చాడు.

రింగును క్రింద పారేసి మౌనంగా వుండడం. అలా చేస్తే మనకు రింగు అప్పుడే దొరుకుండేది. కానీ అలా చేయలేదు.

రెండవది - రింగును ఏ తివాచీ కిందో, కుర్చీ సందులోనో దాచిపెట్టడం. అలా చేస్తే అతడు తిరిగి ఈ హోటల్ గదిలోకి ప్రవేశించి రింగును తీసు కోవడం కష్టం. ఒకవేళ వచ్చినా హోటల్ స్టాఫ్ ద్వారా మనకు తెలుస్తుంది. అలా దొరికి పోతాడు. అందుకే వాడు ఆ పనీ చేయలేదు.

ఇక మిగులున్నది ఏ బజ్జీలోనో, మంచూరియాలోనే స్వీటులోనో ... తన ప్లేటులో వున్న మరేదైనా తినే పదార్థంలో పెట్టేసి చెత్తలో పారేయడం ఆ తర్వాత హోటల్ వారు ఎలాగూ ఈ చెత్తను దగ్గరలో వున్న ఏ చెత్త కుండీలోనో పారేస్తారు. వాళ్ళు పారేయగానే చెత్త కుండీలో హ్యాపీగా రింగు తీసుకువెళ్ళచ్చు. ఇది ఊహించి అందరూ వెళ్ళిపోయాక ఈ చెత్తలో వెతికి తీశాను." వివరించాడు హాస్యచంద్ర.

పద్మజ, పీతాంబరాలతో పాటు హోటల్ స్టాఫ్ కూడా చప్పట్లు కొట్టారు.

"ఇప్పుడు దొంగెవరో మీకు కాసేపట్లో చూపిస్తాను... చూపించే ముందు వాడ్ని కాస్త ఏడిపిద్దాం" అని హోటల్ స్టాఫ్ వంక తిరిగి,

"మిరపకాయబజ్జీలు ఎన్ని మిగిలాయి?" అడిగాడు.

హోటల్ మేనేజర్ గిన్నెను చెక్ చేసి వచ్చి-

"10 మిగిలాయి సార్!" అన్నాడు.

"ఒక రెండొందల బజ్జీలు వేయించి పట్రండి" అని చెప్పి పీతాంబరం వంక తిరిగి-

"ఈ లోపు మీరు భోజనం చేయండి!" చెప్పాడు.

పీతాంబరం, పద్మజ ఆనందంగా తలూపి భోజనం చేయడానికి వెళ్ళారు.

ఈ లోపు వేయించిన మిరపకాయ బజ్జీలను ఒక్కోదాన్ని తీసుకుని దొంగ తిని వదిలేసిన బజ్జీలా కట్‌చేసి చెత్త కవర్‌లో వేశాడు. ఆ తర్వాత పదిహేను చెత్త కవర్లు తెప్పించి డిన్నర్ రెస్టారెంట్లో మిగిలిపోయిన చెత్తను ఆ 15 కవర్లలో సర్దించి చెత్తకుండీలో పారేయించమని చెప్పాడు.



"అద్భుతం! చెత్తలో వుందని ఎలా కనుక్కున్నావ్!!" అడిగాడు పీతాంబరం.

"మీరెవ్వరినీ సోదా చేయవద్దని చెప్పారు. అందుకే దొంగగాడి సైకాలజీ మీద ప్లే చేశాను. రామును మెట్ల దగ్గరికి పంపి సోదా చేస్తామనే భ్రమ కలిగించాను. దొంగకు లోపల డిటెక్టివ్ వున్నాడనే భయం కలగగానే వాడు లోలోపలే వణికి పోయుంటాడు. ఉంగరం తన దగ్గరుంటే సోదాలో దొరుకుతుందని భయపడి దాన్ని వదిలించుకోవడానికి ప్రయత్నిస్తాడని ఊహించాను.

అతడికి ఉన్నవి మూడు దారులు. ఒకటి

ఆ తర్వాత హాస్యచంద్ర, రాము, పద్మజ, పీతాంబరం, పీతాంబరం కారులో కూర్చుని కారు లైట్లు ఆఫ్ చేసి చెత్తకుండీకి 100 మీటర్ల దూరంలో కూర్చుని చూడసాగారు.

గంట తర్వాత వారి నిరీక్షణ ఫలించి ఓ వ్యక్తి చెత్తకుండీ దగ్గరికి వెళ్ళి చెత్త కవర్లు

తీసి ఒక్కో మిరపకాయబజ్జీని తీసి వెతక సాగాడు.


"ఎవరు సార్ వాడు?!" అడిగాడు హాస్య చంద్ర.

"మొహం సరిగ్గా కనిపించట్లేదయ్యా!..." అన్నాడు పీతాంబరం.

ఆ వ్యక్తి ఒక్కో బజ్జీని కులంకషంగా పరిశీలిస్తూ... ఏ బజ్జీలోనూ రింగ్ లేకపోవడంతో తలబాదుకోసాగాడు.

హాస్యచంద్ర కారు దిగి మెల్లిగా అతని వైపు నడిచాడు.

మనిషి అడుగుల చప్పుడు వినిపించడంతో అప్పటి వరకూ వెతుకుతున్న ఆ వ్యక్తి మూత్ర విసర్జన చేస్తున్న వాడిలో నటిస్తూ చెత్తకుండీకి అటు వైపుగా తిరిగి నించున్నాడు.



హాస్యచంద్ర అతని దగ్గరకు వెళ్ళి "రాని నిద్ర, నటించలేని ప్రేమ ఒలకపోయడం, బ్లాడర్‌లోనికి యూరిన్ చేరక ముందే పోస్తున్నట్లు నటించడం చాలా కష్టం మాస్టారూ! చెత్తలో చేసిన వెత్త పరిశోధన ఇహ చాలు గానీ పదండి" అని దొంగ మెడమీద చెయ్యి వేసి బరబరా లాక్కొచ్చి... పీతాంబరానికి చూపాడు.

"అరే! వీడు మా ఆఫీసులో క్లర్కు దివాకరం" ఆశ్చర్యంగా అన్నాడు పీతాంబరం.

దివాకరం తలవంచుకుని నిలబడ్డాడు.

హాస్యచంద్ర, రాము మొహమొహాలు చూసుకున్నారు.

"చెప్పు దివాకరం... ఎందుకు చేశావు?" అడిగాడు పీతాంబరం.

"సా...ర్... అదీ...ఒకడు నన్ను బెదిరించి ఈ పనికి పురికొల్పాడు. దొంగతనం నా వల్ల కాదని నేను చెప్పినా వినకుండా, నా కొడుకును చితకబాదుతానని భయపెట్టి ఈ పని చేయించాడు."

"ఎవడు వాడు?" అడిగాడు పీతాంబరం.

"రామశర్మ"

"ఆఁ!..." హాస్యచంద్ర, రాము నోళ్ళు తెరిచారు.

ఏ.కె.47 పోయిందని వెతికి తెమ్మని తమకు పురమాయించింది...రామశర్మ.

✦✦✦

సమత, భయంభయంగా కాలింగ్‌బెల్ నొక్కింది.

ఆమె తల్లి తలుపు తెరిచింది.

తల్లి మొహం చూడగానే... సంధ్యావందనం తన తండ్రికి ఫోన్ చేసుంటాడని అర్థమయ్యింది. సమత మౌనంగా తన గదిలోనికి వెళ్ళిపోయింది.

ఆమె తండ్రి ఆమెను పలకరించలేదు.

దాంతో ఆమెకు మరింత టెన్షన్‌గా ఉంది.

తన తండ్రి తనతో ఏమంటాడో... దానికి తాను ఏం సమాధానాలు చెప్పాలో ఆలోచించింది.


తండ్రి – 'నువ్వు నా కడుపున చెడబుట్టావే.'

సమత–'లేదు. నేను అమ్మ కడుపున పుట్టాను.'

'ఛీఛీ... బాలేదు. ఇందులో డబుల్ మీనింగ్ ధ్వనిస్తోంది.'

తండ్రి – 'నిన్ను నా గుండెలమీద పెట్టి పెంచుకొన్నానమ్మా... ఇప్పుడు గుండెపై తన్ని పోతావా?'

సమత – 'ఎలాగూ పెళ్ళి చేసి నన్ను తరిమేస్తారు...ఐమీన్ పంపేస్తారు. తరిమేయించు



కొనే బదులు తన్నేసి పోతున్నా...'

ఛీ ఛీ... ఇదీ బాలేదు ఇందులో తిట్టు ధ్వనిస్తోంది.

తండ్రి –'నువ్వు చిన్నప్పటి నుండీ ఏది అడి గితే అది ఇచ్చాను. కానీ, ప్రేమించానంటే మాత్రం ఒప్పుకోను.'

సమత – 'సినిమా డైలాగులు వద్దు నాన్నా! నేను, చిన్నప్పుడు విహారయాత్రకు వెళతానంటే పంపలేదు. కుక్కను పెంచుతానంటే ఒప్పుకో లేదు. నా గదిలో పింక్ కలర్ పేయింట్ వేయించమంటే ఆకుపచ్చరంగు పెయింట్ వేయించావ్. స్కూటీ కొంటానంటే వద్దన్నావ్. ఇంకా చాలా వున్నాయి. అంచేత, నేను పెద్దగా ఫీలవ్వను.'

ఛీ! లెంగ్త్ మరీ ఎక్కువయ్యింది.

తండ్రి – 'నా ఆస్తిలో నీకు చిల్లి గవ్వ కూడా ఇవ్వను.'

సమత – 'నాకు ఉద్యోగం ఉంది. అతనికి రెగ్యులర్ ఇన్‌కమ్ ఉంది. నువ్వేమీ రతన్ టాటావో, లక్ష్మీ మిట్టల్‌వో, అంబానీవో కావు. అంచేత నీకున్న అతి కొద్దిపాటి ఆస్తిపై నాకు ఆశలేదు.'

హ్మ్... ఫరవాలేదు! ఇది బానే వుంది.

సమత ఇలా రకరకాలుగా తలబాదు కుంటుంటే ... తలుపు చప్పుడయ్యింది.

అక్కడ తండ్రి నిలబడున్నాడు.

"రేపు నువ్వు ఆఫీసుకు వెళ్ళాక హాస్య చంద్రను ఇంటికి రమ్మను...మాట్లాడాలి" అన్నాడు.

"నాన్నా!! నువ్వు అతనితో ఇంటి పనులు, వంటపనులు చేయిస్తానంటే నేను ఒప్పు



కోను."

"ఏం చేయిస్తానో నీకు అనవసరం.... రమ్మను. అంతే!" చెప్పేసి, తన గదికి వెళ్ళి పోయాడు.

సమత పిడికిలి బిగించి, దిండును గట్టిగా బాదింది.

✦ ✦ ✦

హాస్యచంద్ర, ప్రహేళికరావు దంపతుల ముందు కూర్చుని ఉన్నాడు.

"నువ్వు నన్ను మోసం చేసావ్. మా అమ్మా యిని ప్రేమించే వాళ్ళ లిస్టు ఇవ్వమని నీకు డ్యూటీ పురమాయిస్తే అందులో నీ పేరును కూడా ఇవ్వాలి కదా! ఇవ్వలేదు" అన్నాడు ప్రహేళికరావు.

"మీ అమ్మాయిని ప్రేమించే వాళ్ళ లిస్ట్ అడి గారు. మీ అమ్మాయి ఎవరినైనా ప్రేమించిం



నీ 'ఆగడం' చూస్తుంటే నేనిక్కడ ఇంకా 'ఆగడం' శుద్ధ దండగ.

దేమో కనుక్కోమని చెప్పింటే నా పేరు ఇచ్చే వాడిని" అన్నాడు హాస్యచంద్ర.

"అంటే... నువ్వు మా అమ్మాయిని ప్రేమిం చలేదా?"

"మీ అమ్మాయే నన్ను ప్రేమించింది."

"అంటే... నువ్వు మా అమ్మాయినిప్పుడు ప్రేమించడం లేదా?"

"ఇప్పుడు ప్రేమిస్తున్నాను."

"హ్మ్! చిదంబరం, సోనియాగాంధీ, దిగ్వి జయ్‌సింగ్, కె.సి.ఆర్., వై.యస్.జగన్, చంద్ర బాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి ... వీళ్ళందరూ తెలం గాణా విషయంలో ఎలా మాట్లాడారో అలా మాట్లాడుతున్నావ్."

"......................."

"ఏమిటి నీ సమాధానం?" (సశేషం)




ఓసారి ఇటు చూడండి. ఈ చీర 15 వేలుట
ఇదేమో 2 వేలుట. మీకేది బాగుంది... దసరా పండుగ కదండీ.
నిజం చెప్పాలంటే, నువ్వు కట్టుకుంటే ఈ చీరకే అందం వస్తుంది. నీ ఒంటి రంగుకి ఇది బాగా మేచ్ ఔతుంది
ఇది రెండు వేలే. సరేలెండి, మిమ్మల్ని చిన్నబుచ్చడం నాకిష్టంలేదు. ఇదే తీసుకుంటాను
నాకేమో ఈ 15 వేల చీర నచ్చిందండి. అదే తీసుకుంటున్నాను.

ధారావాహిక ప్రారంభం!



జయదేవ్ వ్యంగ్య చిత్ర విన్యాసం

డాక్టర్ రావెళ్ళ

మనల్ని హాయిగా నవ్వించే కార్టూన్ల వెనుక పెద్ద కథ ఉంటుంది. కార్టూన్ గీస్తున్నారంటే కొత్తగా ఉండాలి. వచ్చిన ఐడియాని జాగ్రత్తగా పట్టుకుని పాత్రల్ని సృష్టించి వాళ్ళెక్కడున్నారో... ఏం చేస్తున్నారో... తెలిపే బొమ్మల్ని చిత్రించి, తక్కువ మాటల్లో వ్యాఖ్య రాసి, ఒకటికి నాలుగుసార్లు సరిచూసుకుని జనం మీదికి వదలాలి. బ్యాలెన్స్ తప్పితే పాఠకులు పెదవి విరుస్తారు.

ఒక కార్టూను చూసిన వాళ్ళు నవ్వుకున్నా... భుజాలు తడుముకున్నా... పొగిలి పొగిలి నవ్వుకున్నా... ఆ కార్టూన్‌కు ప్రయోజనం సిద్ధించినట్లే! గీసేవారికి అనేక జాగ్రత్తలు అవసరం.

ఆ జాగ్రత్తలు పాటిస్తూ కార్టూన్లు వేల సంఖ్యలో గీసి లక్షలాది పాఠకుల గుండెల్లో స్టాంపు వేసుకున్న కార్టూనిస్ట్-**డాక్టర్ జయదేవ్‌బాబు!**

చిన్నగా ప్రయాణం మొదలుపెట్టి అలుపనేది లేకుండా యాభై ఐదేళ్ళుగా కార్టూన్లు గీస్తూనే ఉన్నారు. వారి 'నిబ్బు'కు విరామం లేదు. ఏడు పదుల వయసు దాటినా ఇంకా ఉత్సాహంగా కార్టూన్లు గీస్తూ ఉండటం చూస్తుంటే ఎవరికైనా ఆశ్చర్యం వేస్తుంది.

జీవితంలోని అన్ని కోణాలను కార్టూన్లలో ఆవిష్కరించారు. ప్రేమ...విషాదం... కష్టసుఖాలనన్నింటినీ కార్టూన్లలో నింపారు. ముఖ్యంగా తెలుగువారి జీవితాలని తనువెల్లా నింపుకున్న మనిషి జయదేవ్!



మధ్యతరగతి జీవితాలపై వారు గీసే కార్టూన్లు చూస్తే వీరు చెన్నైలో ఉంటారని ఎవరూ అనుకోరు. కార్టూనిస్ట్‌గా సాధన చేసి సాధించారు. ఏదీ వివాదాస్పదం కాకుండా తక్కువ పదజాలంతో వ్యంగ్యాన్ని నింపి కార్టూన్లు గీసారు... ఇప్పటికీ గీస్తూనే ఉన్నారు. తెలుగులో వెలుగొందిన పత్రికల నుండి చిన్నాచితక పత్రికలకు కూడా వీరు కార్టూన్లు వేసారు. కుక్కలు, నక్కల దగ్గర్నుండి... కాకీ కొంగల దాకా అన్నీ వీరి కార్టూన్లలోని పాత్రలే!

ఆంధ్రదేశంలో కార్టూన్లు గీసి 'ఆహా!' అనిపించుకోవడమే కాదు... అంతర్జాతీయ స్థాయిలో కూడా పలు బహుమతులు పొందారు. వీరి కార్టూన్లు బెల్జియం, పోలెండ్, జపాన్, ఇటలీ, టర్కీ, బల్గేరియాల్లో జరిగిన ప్రదర్శనల్లో ప్రదర్శించబడ్డాయి.

తెలుగు కార్టూనిస్టులంటే జయదేవ్‌గారికి వల్లమాలిన అభిమానం సీనియర్ల నుండి ఈ రోజు మొదటి కార్టూన్ గీసిన వ్యక్తి దాకా అందరినీ ఇష్టపడతారు. మంచి కార్టూన్ గీస్తే వెంటనే మెచ్చుకుంటారు. వీరు రాసే ఉత్తరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ప్రతిదానిలోనూ ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. ఉత్తరం రాస్తే తిరిగి జవాబు ఇవ్వకుండా ఉండరు. నా దగ్గరున్న పాతిక ఉత్తరాల్లో అంతులేని విషయాలు దాగి ఉన్నాయి. ఆ వినయం వల్లనే ఆయనకు గంపెడు మంది ఏకలవ్య శిష్యులు. అందులో నేను ఒకణ్ణి!

పరిచయాలను పోగొట్టుకోరు... ఆప్యాయంగా పలుకరిస్తారు... ఎదురుపడితే చిరునవ్వులు చిందిస్తారు. ఆయన వినయం, విధేయత జనంతో కలిసిపోవడం ఇవన్నీ ఆయనకు దేవుడిచ్చిన వరాలు.

(జయదేవ్ 'ప్రేమ' కార్టూన్లు వచ్చే సంచికలో)



పబ్లిక్ టాక్!

రిచ్‌లుక్ లేని బిర్యాని

తనకున్న మార్కెట్‌ను నిలుపుకోవాలని తమిళ హీరో కార్తీ తెలుగులో విడుదల చేసిన చిత్రం బిరియాని, ఆడియన్స్‌కు గుర్తుండిపోయే చిత్రం కాదు.

జ్ఞానవేయరాజు సగర్వంగా సమర్పించి నిర్మించిన చిత్రంగా టైటిల్ చూపించినా, డైరెక్టర్‌కు మాత్రం ఖర్చు విషయంలో చాలా పరిధులు పెట్టినట్టు తెలుస్తుంది. దాంతో ఈ చిత్రం చిత్రీకరణలో రిచ్‌నెస్ కనిపించకుండా ఒక సాధారణ చిత్రంగా నిలిచిపోయింది.

చిత్రం చివర్లో ట్విస్ట్‌ల మీద ట్విస్ట్‌లు ఇవ్వాలని భావించిన దర్శకుడు ప్రేక్షకులకు కన్‌ఫ్యూజన్ మిగిల్చాడు.

చిత్రం కథ విషయానికి వస్తే- బిజినెస్ మాగ్నెట్ వరదరాజులు (నాజర్)కు ఇద్దరు కుమార్తెలు. పెద్ద అమ్మాయిని విజయకృష్ణ (రాపి)తో వివాహం జరిపిస్తాడు. చిన్న అమ్మాయి రోహిణి, అవినాష్ అనే అబ్బాయిని ప్రేమించి హైదరాబాద్ లేచిపోతుండగా హీరో సుధీర్ (కార్తి), అతని ఫ్రెండ్ పరశు ప్రయాణిస్తున్న కారుకు ఏక్సిడెంట్ చేస్తారు.

ఆ కారణంగా తన తండ్రి పంపిన రౌడీలకు దొరికిపోతారు. వరదరాజులు, అవినాష్‌ను చంపించివేస్తాడు. పోలీస్ ఆఫీసర్ అయిన అవినాష్ అన్నయ్య వరదరాజుల్ని చంపాలని ప్లాన్ చేసి, రాజమండ్రిలో వరదరాజులు ఉంపుడు కత్తె అయిన మాయ సహాయంతో సుధీర్ పరశులను హోటల్‌కి రప్పిస్తాడు.

వరదరాజును హతమార్చ ఆ నేరాన్ని సుధీర్, పరశులపై వేస్తాడు. సుధీర్, పరశులు, వరదరాజులు డెడ్‌బాడీతో సహా పోలీసుల నుండి తప్పించుకుని తన లవర్ కమ్ టి.వి రిపోర్టర్ అయిన ప్రియాంక (హన్సిక) హెల్ప్‌తో అసలు నేరస్తులను పట్టించాలని భావిస్తాడు. గ్రానైట్ కేసులో దోషి అయిన వరదరాజుల్ని అరెస్టు చేయాలని వచ్చిన సిబిఐ ఆఫీసర్ రియాజ్ సహాయంతో సుధీర్ అసలు దోషిని చట్టానికి పట్టిస్తాడు.

అసలు కథ ఇదే అయినా ఫస్టాఫ్ అంత హీరో కార్తి క్యారక్టర్ గురించే చూపించారు.

అందులో కూడా క్లారిటీ లేదు. కార్తి హన్సికను సిన్సియర్‌గా ప్రేమిస్తూనే కనిపించిన అమ్మాయిలను లైన్ వేస్తుంటాడు. తను లైన్ వేసిన అమ్మాయిల్లో ఎవరైనా ఐలవ్‌యూ చెపితే తనకో లవర్ వుందని అప్పుడు చెపుతుంటాడు. ఇలాంటి సీన్లలోనే మొదటిభాగం లాగించేశారు. హీరో క్యారక్టర్‌లో క్లారిటీ లేకుండా పోయింది.

ఫస్టాఫ్ ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌గా చూపించాలని హీరో, కమెడియన్‌లతో సీన్లన్ని అల్లినా, చిత్రకథకు ఉపయోగంలేని సీన్ల కారణంగా ఆడియన్స్ బోర్ ఫీలయ్యారు.

బిరియానీ కోసం దాబా దగ్గర ఆగిన దగ్గర నుండి స్టోరీ స్పీడ్ అవుతుంది. దాంతో ఈ ఫ్రెండ్స్‌తో కలసి కనిపించిన సీన్లలో కొన్ని డైలాగ్స్ బాగున్నాయి.

హీరో కార్తి నటనలో ప్రత్యేకత ఏమీలేదు. తన పాత చిత్రాలలో కనిపించే విధంగా సాధారణ అబ్బాయిలా కనిపిస్తూ ఒంటిచేత్తో పదిమందిని మట్టి కరిపించే పాత్రలో మరోసారి ఈజీగా నటించాడు. హన్సిక కొంత సన్నబడి అందంగా కనిపిం చినా, నటించడానికి స్కోప్ లేని పాత్ర. నాజర్, రాంకీలతో సహా మిగిలిన నటుల గురించి చెప్పడానికి ఏమీలేదు.

పూర్తి వివరాలు తెలియకుండా ఒక్కసారి ఇంటర్వ్యూ చేసిన వ్యక్తికి తన రెండో కూతుర్ని ఇచ్చి పెళ్ళి చేయాలని ఒక కోటీశ్వరుడు భావించడం నాచురల్‌గా లేదు. చిత్రంలో ఇటువంటి లోపాలు చాలా వున్నాయి. కార్తి స్వయంగా పాడిన పాట చిత్రీకరణ ఒక రూమ్‌లో సింపుల్‌గా చిత్రీకరించడంతో ఆ పాట అభిమానులకు నిరాశే మిగిల్చింది.

యువన్‌శంకర్ రాజా అందించిన సంగీతం ఏ మాత్రం అలరించలేకపోయింది. స్టంట్ మాస్టర్ 100వ చిత్రం గుర్తుగా ఫైట్స్ కంపోజింగ్ బాగుంది. మిగిలిన సాంకేతిక నిపుణుల ప్రత్యేకత ఏమీ కనిపించదు. దర్శకుడు ప్రతిసీన్ లోబడ్జెట్‌తో తీయ్యడంతో రిచ్‌నెస్ ఏ మాత్రం లేదు. జూనియర్ ఆర్టిస్ట్స్ విషయంలో కూడా కాంప్రమైజ్ అయినట్టున్నారు. మార్కెట్ సీన్లు కూడా పూర్‌గా కనిపించాయి. నిర్మాత కేవలం కార్తి ఇమేజ్‌పై ఆధారపడి ఖర్చు విషయంలో వెనక్కి తగ్గిన కారణంగా చిత్రం బాగున్నా యావరేజ్ చిత్రంగానే మిగిలిపోతుంది.

చంద్రశేఖర్ త్యాడి



అసాధారణ కార్టూనిస్టు ఆరడుగుల ఆత్మ విశ్వాసం!

సత్యమూర్తిగారు మద్రాసు రాకుంటే... నేను వారిని రిసీవ్ చేసుకోకుంటే... బాపు గారిని 1976లో గాక, మరో పదేళ్ళాగి కలిసుండేవాడినేమో!

సత్యమూర్తిగారు మద్రాసు రాకుంటే... యాడ్ ఏజన్సీలు నడిపేవాళ్ళ ఆరాటాలూ, పోరాటాలూ, అద్భుతాలూ, నాకు బొత్తిగా తెలిసే అవకాశం కలిగుండేది కాదేమో!

సత్యమూర్తిగారు మద్రాసు రాకుంటే... మా ఇంట్లో అంతటి అసాధారణమైన కార్టూనిస్టుకు మా ఆవిడ రుచికరమైన కొబ్బరిపచ్చడి భోజనం వడ్డించేది కాదేమో! అది తినేభాగ్యం నాకు కలిగుండేది కాదేమో!

సత్యమూర్తిగార్ని మద్రాసులో కలవక ముందు, వారిని ఖమ్మంలో తెలుగు కార్టూనిస్టుల కాన్ఫరెన్సులో కలిశాను. కరచాలనం చేసీ చేయకముందే ఆయన ఆప్యాయంగా నా భుజం మీద చెయ్యి వేసి దగ్గరికి లాక్కుని కార్టూన్ ప్రపంచంలో అడుగు పెట్టిన నాకు ఒక గుర్తింపు దక్కించారు. అప్పటి నుండి ఇప్పటిదాకా ఆయన తన స్నేహితుల జాబితాలో నాకు స్థానం కల్పించి ఆప్యాయంగా పలకరిస్తూంటారు. ఉత్తరాలు రాస్తారు. కబుర్లు చెబుతుంటారు. జోకులు విసిరి హాయిగా నవ్విస్తూంటారు.

ఇప్పటి తెలుగు కార్టూనిస్టుల్లో గురుదేవులు పద్మశ్రీ బాపుగారి మినహా, సీనియర్ మోస్ట్ కార్టూనిస్ట్ సత్యమూర్తి గారే!

19.08.1959లో ఆంధ్ర సచిత్ర వార పత్రిక కార్టూన్ పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకుని ధన్‌మని రంగప్రవేశం చేశారు. కొత్త గీతలు, ఎవరి ప్రభావమూ తన మీద గోచరించని స్టైలూ, ఒరవడి, పంచ్‌లతో, దాదాపు ఒక పంచాంగం కాలంగా తెలుగు పాఠక లోకాన్ని నవ్వులతో ముంచెత్తుతున్నారు సత్యమూర్తిగారు.

వేల సంఖ్యలో కార్టూన్లు, ఇలస్ట్రేషన్లూ, లోగోలూ, కవర్ డిజైన్లు, వీటితో పాటు తను స్థాపించిన యాడ్ ఏజన్సీకీ అవసరమైన కన్నుల పండుగ చేసే బొమ్మలూ, సత్యమూర్తిగారిని చిత్ర కళారంగంలో ఉన్నత శిఖరం మీద కూర్చోబెట్టాయి. ఆయన్ని ఈ విధంగా అనుకరించిన వారు నాకు తెలిసి వేరే ఎవరూ లేరు.

సత్యమూర్తిగార్ని పలుమార్లు వారి స్టూడియోలో కలిశాను. వారు పని చేసే తీరును శ్రద్ధతో గమనించాను. వారి 'వర్క్ స్టేషన్' వారు ఉపయోగించే పనిముట్లు, పెన్నులూ, బ్రష్షులూ, జామెట్రీ బాక్సు సాధనాలూ (వీటిని ఆర్కిటెక్టులు ఉపయోగిస్తారు) నన్ను ఆశ్చర్య పరిచాయి.

ఇటువంటి ఆచార్యుడు, చిత్ర రంగంలో ప్రవేశించిన విద్యార్థికి సరైన ఉపదేశం ఇవ్వగలడని తోచి ఆయన్ని హార్ట్ యానిమేషన్ అకాడమీకి ఆహ్వానించాను. అక్కడి విద్యార్థుల 'స్కిల్సు'ను పరీక్షించి వారికి తగిన సలహాలందించి, వారి స్థానాలని వారు అర్థం చేసుకొనే అవకాశం ఏర్పరచవలసిందిగా కోరాను. నామీద అభిమానం కొద్దీ తన పనులను పక్కన పెట్టి వచ్చారు. ప్రతి విద్యార్థిని ఆచి తూచి పరిశీలించి వాళ్ళకి గ్రేడింగ్స్ ఇచ్చారు. అది యానిమేషన్ విద్యార్థులకెంతో తోడ్పడింది. కనువిప్పు కలిగింది.

సత్యమూర్తి ఎంత గంభీరంగా కనిపిస్తారో... అంత గంభీరంగా ఆలోచిస్తారు కూడా. అందుకే ఎవరూ సాహసించని



–జయదేవ్.

యాడ్ ఏజన్సీ రంగంలో కత్తిమీద సాము వంటి ఉద్యోగం తనకు తానే కల్పించుకున్నారు.

"యూవార్ గ్రేట్' అంటే, 'భలేవారు... ఇప్పుడు నా బూట్లు చప్పుడుతో ఒక కర్ర కూడా చప్పుడు చేస్తున్నద'ని జోకులు విసురుతారు.

సత్యమూర్తి అందగాడు. ఆ మధ్య జబ్బు చేసి ఆయన అందం కొంత తగ్గింది. అది చూసి నేను అరాయించుకోలేక పోయాను. సికరాజుగారి ముందు భోరున ఏడ్చాను. సికరాజు గారన్నారు– "సత్యమూర్తిగారి అందం బైట మాత్రమే రవ్వంత తగ్గింది. లోపల మరింత ప్రకాశవంతంగా ఉంది" అని నన్ను ఓదార్చారు.

నిజమే! ఒంట్లో బాగోలేకపోయినా... ఆయన సాధన చేయటం మానలేదు. తన అస్వస్థతను తానే అవతలకి నెట్టివేశారని చంద్రగారు చెబుతుంటారు. అలుపు, నొప్పి ఎరుగని, ఆరడుగుల ఆత్మ విశ్వాసాన్ని, పిడికిట్లో పట్టుకుని హుందాగా కనబడే సత్యమూర్తిగార్ని చూస్తే, మనం కూడా మన బాధలని మరచిపోతాం. మన కర్తవ్యం ఎరిగి, ధైర్యంగా ఆ వంక నడుస్తాం.

సత్యమూర్తి గారికీ, నాకూ మధ్యన మరొక వ్యక్తి వున్నాడు. మా ఇద్దరికీ గిలిగింతలు పెడుతుంటాడు. నవ్విస్తాడు. స్ఫూర్తి నందిస్తాడు. వాడొక డ్రైవరు.

'He drives us crazy'.

చదువుల్రావు మా నాన్నగారు!

నేను 1999వ సం॥లో ఢిల్లీలో పని చేస్తూ ఉండగా వరంగల్ ఆర్.ఈ.సీ.లో మేథమేటిక్స్ డిపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన ఒక కాన్ఫరెన్స్‌కి వెళ్ళడం జరిగింది.

నేను మాట్లాడవలసిన సమయానికి ముందు ఆ కాన్ఫరెన్స్ ప్రధాన నిర్వాహకులు ప్రొఫెసర్ శ్రీ టి.కె.వి. అయ్యంగార్ గారు నన్ను పరిచయం చెయ్యాలి.

నేను స్టేజి మీదకు వెళ్తూండగా ఆయన "ఈవిడ ఐ.ఐ.టి, ఢిల్లీలో మేథమేటిక్స్ డిపార్ట్‌మెంట్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. కానీ ఈవిడని నేను ఇప్పుడు ఇంకో విధంగా పరిచయం చేయబోతున్నాను. అది ఏంటంటే ఈవిడ చదువుల్రావు గారి అమ్మాయి. అంటే ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ బి.వి. సత్యమూర్తిగారి అమ్మాయి ..." అంటూ తను మా నాన్నగారి కార్టూన్లను ఎంతో అభిమానిస్తానంటూ నన్ను పరిచయం చేశారు.

ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగి నాకు ఎంతో ఆనందం కలిగిస్తూంటాయి. ఎంతో మంది మా నాన్నగారు ఎవరో తెలిశాక "మీరు సత్యమూర్తిగారి అమ్మాయా? ఆయన వేసిన చదువుల్రావు కార్టూన్ల కోసం మేము ప్రతి వారం ఎదురుచూసేవాళ్ళం. ఆ కార్టూన్లు కట్ చేసి దాచుకొనే వాళ్ళం" అని ఇప్పటికీ చెప్తూంటారు.

ఆ శీర్షిక ప్రచురణ అయినప్పుడు నేను పుట్టకపోయినా అది ఎంత ప్రజాదరణ పొందిందో... ఎంత సంచలనం సృష్టించి ఉంటుందో వారు చెప్పిన విశేషాల వలన అర్థమవుతుంది.

ఏదైనా బేంక్‌కి వెళ్ళినప్పుడు అక్కడ సీనియర్ ఉద్యోగులు, ఏదైనా హాస్పిటల్‌కి వెళ్ళినప్పుడు అక్కడి సీనియర్ డాక్టర్లు, స్నేహితుల తల్లిదండ్రులు చిన్నప్పుడు మా స్కూల్లో, కాలేజీలో, ఆ తరువాత నేనిప్పుడు పనిచేసే యూని



వర్శిటీలో టీచర్లు, ఉద్యోగులు ఎందరో ప్రముఖులు మా నాన్నగారి అభిమానులమని చెప్పినప్పుడు నాకెంతో సంతోషంగా ఉంటుంది.

నన్ను చిన్నప్పుడు మా నాన్నగారు 'అమ్మాయి గారు' అని పిలిచేవారు. మా నాన్నగారు రాత్రింబవళ్ళు పనిలో బిజీగా వుంటే చిన్నప్పుడు నాది, మా తమ్ముడు భాస్కర్‌ది చదువు విషయం మా అమ్మగారే చూసుకునే వారు. అయినా తీరిక వేళల్లో మా నాన్నగారు నాకు పెయింటింగ్, డ్రాయింగ్ నేర్పించేవారు. మా తమ్ముడికి కూడా. ఆయన చదువులో ఎక్కువ జోక్యం కలిగించుకోకపోయినా ఆయనని చూసి కష్టపడి పనిచెయ్యడం నేర్చుకున్నాను. ఆయనకి పనిపట్ల ఉన్న ఏకాగ్రత, శ్రద్ధ ఇప్పటికీ కష్టపడి పనిచేయడం నన్ను ప్రభావితం చేసాయని నాకు అనిపిస్తుంది.

చిన్న చిన్న విషయాలకి తీవ్రంగా స్పందించి, మానసికంగా కృంగిపోయేవారికి మా నాన్నగారి గురించి చెప్పాలనిపిస్తుంది. ఆయన ఎక్కిన ప్రతీ మెట్టు వెనకాల ఎంతో పట్టుదల, కృషి, మానసిక ధైర్యం ఉండడమే దీనికి కారణం.

తనవంతు కృషి చేసి దైవం మీద భారం వేసి తర్వాత ఏం జరిగినా దానిని దైవ నిర్ణయంగా తీసుకోగలగడం వలన జీవితంలో ఒడిదుకులను తట్టుకో గలిగారు. దేవుడెప్పుడు తనవెంటే ఉంటాడని నమ్మడమే దీనికి కారణమనుకుంటా.

1984లో జరిగిన ఒక సర్జరీ వలన ఆయన కుడి చేయికి, కాలుకి పూర్తిగా పెరాలసిస్ వచ్చి ఆయనకి ఒక గీత కూడా గీయడం సాధ్యం కాలేదు. కానీ ఏడాదిన్నర తర్వాత కోలుకొని ఆయన పూర్తిగా ఇదివరకటిలా బొమ్మలు వేయగలిగారు. దానికి కారణం ఆయన నమ్మిన భగవంతుని దయతో పాటు ఆయన ఫిజియోథెరపీ తీసుకొని ఎంతో పట్టుదలతో, దీక్షతో రకరకాల ఆకారాల గీతలు, డ్రాయింగ్, తెలుగు, ఇంగ్లీష్ అక్షరాలు ప్రాక్టీస్ చేసేవారు. కొన్ని వందల పేజీల కాపీ రైటింగ్ రోజూ నుంచి మళ్ళీ మామూలుగా ఆయన పనిని ఆయనే చేసుకొంటూ, ఎప్పటిలా బొమ్మలు, కార్టూన్లు వేయగలిగారు.

ఆ సమయంలో మా అమ్మ, నాన్నగారి తరపు బంధువులు మా పట్ల చూపించిన ప్రేమ వలన మేము ఎటువంటి అభద్రతా భావం లేకుండా ఉండేవారము. ముఖ్యంగా మా నాన్నగారి చిన్నన్నయ్య శ్రీ బి.వి.రమణరావు గారు జీవితంలో అన్ని సందర్భాల్లోను మా నాన్నగారికి అన్ని రకాలుగా అండగా వుండి, ఎంతో ధైర్యాన్ని ఇచ్చేవారు.

ఇప్పటికీ రోజంతా కార్టూన్లు వేయడం మా

నాన్నగారికి ఇష్టం. రోజంతా చురుకుగా, ఉత్సాహంగా ఉండటానికి కార్టూన్లు వేయడం మానొద్దని ఒక డాక్టరు గారు కూడా అన్నారు ఆయనతో.

పుస్తకాలు చదవడం, పని చేస్తున్నంతసేపు బాక్‌గ్రౌండ్‌లో కున్నక్కుడి వైద్యనాథన్ గారి వయొలిన్, శ్రీనివాస్ మేండోలిన్, రాజ్‌కపూర్ పాటలు, సైగల్, ముఖేష్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాటలు లేదా బాబాగారి పాటలు, ఉపన్యాసాలు వింటూ పనిచేసుకోవడం ఆయనకి అలవాటు. ఆయన కూడా మౌత్ ఆర్గన్ వాయించేవారు.

మంచి పర్సనాలిటీ కలిగి, మౌత్ ఆర్గన్ వాయిస్తుంటే చదువుల్రావ్ శీర్షిక ద్వారా పేరు ప్రఖ్యాతులు పొందిన మా నాన్నగారికి కాలేజి పిల్లలు ఎంతోమంది ఫాన్స్ ఉండేవారని చంద్ర అంకుల్ లాంటి వారు చెప్తూ ఉంటారు.



మా అమ్మకి కూడా కర్ణాటక సంగీతంలో ప్రవేశం ఉంది. ఎన్నో పెయింట్స్ వేసేది. బహుశా అందుకే మా తమ్ముడు సాయి భాస్కర్ కి సంగీతంలోనూ, బొమ్మలు వేయడంలోనూ ఆసక్తి, ప్రావీణ్యం కలిగాయి. చిన్నప్పటి నుంచీ మా నాన్నగారి డిజైనింగ్ ఎడ్వర్టయిజ్‌మెంట్ బిజినెస్‌లో ప్రవేశం చేశాడు.

కార్టూన్లు ఎలా వెయ్యాలనే విషయంపై మా నాన్నగారు వ్రాసిన పుస్తకాలను ఎప్పుడైనా నా స్నేహితుల పిల్లలకిచ్చినప్పుడు వారు వాటిని చూసి బొమ్మలు వేయడం నేర్చుకోవడంలో ఆసక్తి చూపించినప్పుడు నాకెంతో గర్వంగా ఉంటుంది.

మా నాన్నగారి 75వ పుట్టినరోజు సందర్భంగా హాస్యానందం ఆయన గురించి ప్రత్యేకంగా ప్రచురిస్తున్నందుకు నా కృతజ్ఞతలు.

ఈ సందర్భంగా మీ అందరి శుభాకాంక్షలు మా నాన్నగారికి, అమ్మగారికి తద్వారా మా అందరికీ చేరాలని కోరుకుంటున్నాను.

-బి. శ్రీపద్మావతి,
మేథమేటిక్స్ ప్రొఫెసర్,
యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్.

అందరికీ ఇది హేపీ న్యూ ఇయరే!



శ్రీసత్యమూర్తిగారంటే నాకు ఎంతో గౌరవ అభిమానం. జనవరి2014 కొత్త సంవత్సరం. ఈ నూతన సంవత్సరంలో హాస్యానందంలో అందరికీ అభిమానులు, ఆత్మీయులు ప్రముఖ కార్టూనిస్ట్ అయిన శ్రీసత్యమూర్తి గారి కార్టూన్ వైభవం వస్తుందంటే...

నిజంగా అందరికీ హేపీ న్యూ ఇయరే కదా!

శ్రీసత్యమూర్తిగారి కార్టూన్లు నేను చిన్నప్పట్నుంచీ చూస్తున్నాను. వారి బొమ్మలూ,కార్టూన్లు భలే వెరైటీగా వుంటాయి. ఆయన ఎవర్నీ అనుసరించరు. ఆయన్నీ ఎవరూ ఎవరూ అనుకరించలేరు. ఆ రోజుల్లో ఆయన వేసే చదుల్రావు కార్టూన్లు చదివి తెగ నవ్వుకునే వాళ్ళం. (మళ్ళీ మాకు చదువుల్రావు కావాలి సార్)

ఒకసారి నేను శ్రీసత్యమూర్తిగారికి నా డౌట్స్ కొన్ని తెలుపుతూ లెటర్ రాసాను. కొద్దిరోజులకి ఆయన ఆశీస్సులతో చక్కని జవాబు రాస్తూ-బోల్డన్ని నిబ్బులూ... క్రోక్విల్ పెన్నులూ... ఇండియన్ ఇంకులూ... పెన్సిళ్ళూ... రబ్బర్లూ... ఆయన రాసిన 'కార్టూన్లు వెయ్యటం ఎలా?' అనే బుక్స్ ఇవ్వన్నీ శ్రీసత్యమూర్తిగారు నాకు కొరియర్‌లో పంపించారు. నేను విస్తుపోయాను.

వారి అభిమానానికీ ఆత్మీయతకూ ఎంతో సంతోషం కలిగింది.

శ్రీసత్యమూర్తిగారు ఆయురారోగ్యాలతో ఎప్పుడూ కార్టూన్లు వేస్తూనే ఉండాలని మనసారా ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

-కుమారి రాగతిపండరి, కార్టూనిస్ట్, విశాఖపట్టణం.



ఆయన పరిచయం ఓ అదృష్టం!

శ్రీ సత్యమూర్తిగారు మా నాన్నగారికి బాగా పరిచయం. 1976లో నేను కార్టూన్లు గీయడం మొదలెట్టాక మా నాన్నగారు శ్రీ సత్యమూర్తి గారిని పరిచయం చేశారు. ఆ తరువాత వారిని అనేకసార్లు వారి ఆఫీస్‌లో కలుసుకోవడం జరిగింది.

శ్రీసత్యమూర్తిగారు మృదుస్వభావి.

పేరుకు తగ్గట్టుగా సత్యం మాత్రమే పలుకుతారు. ఎంతో బిజీ అయినా, ఆయనతో కొన్నిసార్లు కార్టూన్ వర్క్‌షాప్‌లను నిర్వహించాను. కొన్నిసార్లు ఎగ్జిబిషన్‌లకు ముఖ్య అతిథిగా విచ్చేసి, తన అమూల్య సందేశాల్ని సోదర కార్టూనిస్ట్‌లకు అందజేసారు.

భగవంతుని పట్ల విశ్వాసం అపారంగా కలిగిన శ్రీ సత్యమూర్తిగారు... బ్రెయిన్ ఆపరేషన్ జరిగిన తరువాత మొక్కవోని ధైర్యంతో ఎంతో పట్టుదలతో కృషితో మళ్ళీ కార్టూన్లు గీయడం మొదలెట్టి మాలాంటి వాళ్ళకు స్ఫూర్తి నిచ్చారు.

-జి.ఎస్.ఆర్, కార్టూనిస్ట్



గుర్తొస్తున్నాయి.....






OON UTSAV 2002
MARCH 9-10

14
NNU
VAM
BER





విజయలక్ష్మీరాజు

పెళ్ళిఫోటో

సీరియల్

"మీరూరుకోండి. మీ అన్నయ్య మరీ చాదస్తం. మరేం అనుకోకు బాబూ. చదువుకున్న వాళ్ళు మీకు ఆయన నీతులు చెప్పటమేంటి చాదస్తం విద్దూరం కాకపోతేనూ" అంది నిర్మల.

"పర్వాలేదులే వదినా! అన్నయ్యేగా. ఇక మేం బయల్దేరుతాం" అంటూ సెలవు తీసుకున్నారు సుబ్బారావు, శ్రీవల్లి.

✦ ✦ ✦

"హాయ్ మంత్! రా! రా! ఏదైనా ప్రోగ్రెస్ సాధించారా?... ఆర్తి డార్లింగ్! ఈ పూట వంట చెయ్యొద్దు హనుమంతుదొచ్చాడు. కొత్తగా ఓపెన్ చేసిన హోటల్‌కు తీసుకెడతాను. త్వరగా వచ్చెయ్యి" అంటూనే దేవేంద్ర హనుమంతు మొహంమీద మారుతున్న భావాలను లెక్కపెట్టకుండా వంటింట్లోకి చూస్తూ కేకేశాడు ఓ వైపు హనుమంతును ఆహ్వానిస్తూనే.

హనుమంతుకు పళ్ళు మండిపోయింది.

తమాయించుకుని కుర్చీలో కూర్చుని కర్చీఫ్‌తో మొహం తుడుచుకున్నాడు.

"ఏమబ్బాయ్! టెన్షన్ ఫీలవుతున్నట్టున్నావ్ ఏం జరిగిందేమిటి?" అంటూ ఆర్తి వచ్చి హనుమంతు కెదురుగా వున్న సోఫాలో కూర్చుంది.

"మా ప్రక్కవీధిలో ఓ అమ్మాయి చాలా అందంగా వుంది. ఆ అమ్మాయిని ప్రేమించాలనుకుంటున్నాను" రకామని పాయింటుకొచ్చేస్తూ అన్నాడు.

"అంతే కదా! దానికి సందేహాలెందుకు? ప్రేమించెయ్. ప్రేమించే హక్కు ఈ భూమ్మీద పుట్టిన ప్రతి ప్రాణికీ వుంది. యా మై కరెక్ట్ డార్లింగ్?" గోముగా దేవేంద్రవైపు చూస్తూ అంది ఆర్తి.

"నీకీమధ్య కవిత్వం చాలా సులభంగా వచ్చేస్తోంది డార్లింగ్!... మనసులో కొచ్చిన కవిత్వమంతా పేపరుమీద పెట్టు. ఓ సంకలనం వేయించి ముఖ్యమంత్రితో పుస్తకావిష్కరణ చేయిద్దాం" బుగ్గమీద చిటికేస్తూ అన్నాడు దేవేంద్ర.

"ముఖ్యమంత్రిగారికి బాటలెక్కువ. మన బాట కొస్తారంటావా?" ఆర్తి దిగులుగా అంది.

"అయితే సోనియా గాంధీని పిలిపిద్దాం. ఆమెకు త్యాగబుద్ధి ఎక్కువ. నీకోసం ప్రోగ్రాంలన్ని కాన్సిల్ చేసుకునైనా వస్తుంది" దిగులు పడవద్దన్నట్టు... ఆర్తి వీపు మీద చరుస్తూ అన్నాడు దేవేంద్ర.

"టాపిక్‌లోకొస్తారా?" పళ్ళబిగువున కోపాన్ని దిగమింగుతూ అన్నాడు హనుమంతు.


"ఓ సారీ!... అఁ ఏంటి చెప్పు. మీ ప్రక్క వీధిలో అమ్మాయిని నీవు ప్రేమించావు. ఆమె నిన్ను ప్రేమించాలి. అంతే కదా!" అన్నాడు దేవేంద్ర.

"అంతే!" తేగేసినట్టు అన్నాడు హనుమంతు సలహా చెప్పి ఏడమంటే ముసలి పీనుగులు నా ముందే శృంగారం ప్లే చేసేట్టున్నారు. మనసులో తిట్టు కున్నాడు.

"వెరీ సింపుల్! ఆ అమ్మాయి ఒంటరిగా వుండటం చూసి ఓ గులాబీపువ్వు... ఛ... ఎందుకులే...ఓ తంగేడుపువ్వు... లేదా గన్నేరు పువ్వు... ఇచ్చి నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని చెప్పేసెయ్" అంది ఆర్తి.

"మరీ పరిచయం ఏ మాత్రం లేకుండా అంత స్పీడుగా చెప్పేస్తే చెప్పుచ్చుకు కొడితే?" అన్నాడు హనుమంతు కచ్చ ధ్వనిస్తూ.

"కొడుతుంది, కొట్టాలి కూడా అప్పుడే నీ ప్రేమ పండుతుంది."



జరిగిన కథ: చిన్నప్పుడు సుబ్బారావుతో ఒకజంట ఫోటో చూస్తుంది శ్రీవల్లి. వాళ్ళెవరో ఇంట్లో వాళ్ళకెవరికీ తెలియదంటారు. ఎవరికీ తెలియని ఆ ఫోటోలోని వ్యక్తుల గురించి తెలుసుకోవడానికి సుబ్బారావు బంధువులందరినీ కలవాలనుకుంటుంది శ్రీవల్లి.

ఆ భాగంలో సుబ్బారావు పెద్దక్కయ్య, అన్నయ్య వాళ్ళింటికి వెళతారు. —ఇక చదవండి



"ఏమిటీ చెప్పుతో కొట్టించుకుంటే ప్రేమ పండుతుందా?" కోపంగా అడిగాడు హనుమంతు.

"చెప్పేది పూర్తిగా వినవు కదా! చెప్పుతో కొట్టగానే నువ్వు ప్రూన్పడిపోతావు. ఆ అమ్మాయి వెనుదిరిగి చూడకుండా వెళ్ళిపోతుంది. ఆ రాత్రి పడుకున్న తర్వాత నీ గురించి, తెగిన తన చెప్పు గురించి, లైట్స్ ఆన్ అండ్ ఆఫ్ చేస్తూ ఆలోచిస్తుంది. గాలికోసం బెడ్‌మీది నించి లేచొచ్చి తలుపు తీస్తుంది. తన ఇంటి కెదురుగా రోడ్డు కవతల వీధిలైటు క్రింద నీవు నిలుచుని వుండాలి."

"నిలుచోక తప్పదా? కూర్చోకూడదా?" అంది ఆర్తి విలాసంగా నవ్వుతూ.

'నా బ్రతుకు బ్రతికుండగానే భూస్థాపిత మవుతుందనుకోలేదు...' గొణుక్కున్నాడు హనుమంతు.

"కూడదు. నిల్చోవటమే కాదు కళ్ళార్పకుండా ఆ అమ్మాయి ఇంటివేపే చూస్తుండాలి. ఆ అమ్మాయి నిన్ను చూసి తలువేస్తుంది. నీవు నిరాశ పడకూడదు. వర్షం వచ్చినా సరే తెల్లవార్లూ అలాగే నిలబడాలి. అంతే, అమ్మాయిలకు ఈ తరహా ప్రేమికులంటే చాలా ఇష్టం. ఉదయం లేవగానే తలుపు తీసి కన్నీళ్ళతో వచ్చి నిన్ను హత్తుకుపోతుంది. ఏడుస్తూనే 'అయ్ లవ్ యు' అంటూ వందసార్లు చెబుతుంది... కథ సుఖాంతం."

"ఇదేదో సినిమాలోని సన్నివేశంలా వుంది. ఇదేనా మీరిచ్చే సలహా?"

"యస్! సినిమాలోనే! 'నువ్వూ నేనూ చచ్చిపోదాం' లోనిది. సినిమాలో సన్నివేశమైనా ఈ విధంగా చేయాలని నీకు తోచలేదు. చూశావా తెలిసిన విషయమైనప్పటికీ, మా నోటినించి రావటంతో అది సలహాగా మారింది. ఫీజు కట్టాల్సిందే" అంది ఆర్తి ఖండితంగా.

"సరే, సరే. ఇంకో సలహా చెప్పండి రోజూ ఇంత దూరం రావటం కష్టంగా వుంది."

"ఫీజవుతుంది."

"తెలుసు, చెప్పండి."

"ఆ అమ్మాయికి తమ్ముళ్ళో, చెల్లెళ్ళో వుంటే చాక్లెట్లు, బిస్కట్లు కొనిచ్చి మంచి చేసుకుని లవ్‌లెటర్ పంపు."

"ఆ అమ్మాయికి అన్నలెవరైనా వుంటే వినయ విధేయతలతో పరిచయం చేసుకుని మెల్లగా వాళ్ళింటి దారి పట్టి ఆ అమ్మాయితో మాటలు మొదలెట్టు."

"అమ్మాయిలన్న తర్వాత ప్రతిరోజూ ఏదో ఒక టైంకు బ్యూటీ పార్లర్‌కో, ఫ్రెండింటికో, గుడికో వెళుతుంటారు. ఆ టైం క్యాచ్ చేసి నువ్వూ ఫాలో అయి... నెమ్మదిగా స్నేహం చెయ్యి."

"ఏమిటి డార్లింగ్! వరుసపెట్టి సలహాలన్నీ ఒకేరోజు చెప్పేస్తే మన బిజినెస్ డల్ అవుతుంది. అలా చెప్పటం మన రూల్స్‌కి విరుద్ధం

కూడా" మధ్యలో బ్రేక్ వేస్తూ అన్నాడు దేవేంద్ర.

"హో...! సారీ డియర్! అబ్బాయ్ ఫీజు ఇచ్చేసి వెళ్ళు" అంది కచ్చితంగా మాట్లాడుతూ ఆర్తి.

పళ్ళు పటపటలాడిస్తూ డబ్బు టీపాయ్‌మీద పడేసి లేచివచ్చాడు హనుమంతు.

మనసులో ఏదో వెలితిగా అనిపించ సాగింది.

కళావతిని చూడాలనిపించింది. ఆమె ఎప్పుడు ఎక్కడికి పడితే అక్కడికి రాదని తెలిసి పిలవడం వేస్ట్ అనుకున్నాడు. కనీసం ఓసారి ఫోన్లో అయినా మాట్లాడితే బావుండుననిపించి కళావతి ఇంటికి ఫోన్ చేశాడు.

హలో అనగానే కళావతి వాళ్ళమ్మ ఫోను ఎత్తింది.

"ఎవరూ? ఎవరు కావాలి?"

"కళావతి కావాలండి. కాస్త మాట్లాడాలి ప్లీజ్ పిలుస్తారా?"

"నువ్వెవరో చెప్పు ముందు. అడ్డమైన గాడిదలందరూ ఫోన్ చేస్తే మాట్లాడించాలా? ఆడపిల్లనుకున్నావా? మజాకానా..."

"సారీ... సారీ!... నేను హనుమంతునని చెప్పండి" కంగారుగా ఆమె సంభాషణ కట్ చేస్తూ అన్నాడు హనుమంతు.

"కళా! ఫోను నీకే ఎవరో హనుమంతుట. ఇదిగో తీసుకో. ఎవడే ఈ తోకప్పగాడు?"

"అబ్బబ్బ! ఏమిటమ్మా ఫోనలా మూయకుండా మాట్లాడతావు. అవతల అతనికి వినిపిస్తుంది. నా పెళ్ళిచూపులకొచ్చి కాన్సిల్ చేసుకున్నతను లెద్దూ"

"వాడికి మళ్ళీ ఫోనెందుకు చేస్తున్నావ్. చీపురుమొహమూ వాడూ. ఇంకోసారి ఫోన్ చేస్తే నాలుగు జాడిస్తానని చెప్పు. నకరాలొద్దని చెప్పు" అంటుండగానే ఇంక వినలేక ఫోన్ పెట్టేశాడు హనుమంతు చెమటలు గక్కుకుంటూ.


✦ ✦ ✦

శ్రీవల్లి నిర్మల గురించే ఆలోచిస్తోంది.

స్త్రీలకు సహనం ఎక్కువ అంటారు. ఈ రోజుల్లో ఇలా రాజీపడి ఎంతమంది బ్రతుకుతున్నారు. ప్రేమించిన వాడు మోసం చేసి, కట్టుకున్నవాడు సంసారసుఖానికి పనికి రాకుండా... పాపం అలా అనుకుంటే వ్యాస్ గారిది కూడా చాలా విశాల హృదయం. స్త్రీలంటే గౌరవం లేకుండా చులకన చేస్తూ అణచివేయాలని చూసే ఈ సమాజంలో ఎవరికో పుట్టిన బిడ్డను తాను తండ్రిగా, ఆమెకు భర్తగా... ఎంత మంచివాడు. ఇదంతా ఏదో సినిమాల్లో తప్ప జరగవనుకుంటాం. కళ్ళ ముందు కనిపిస్తున్న ఈ జీవితాలను చూస్తుంటే ఆశ్చర్యంగా వుంది. ఎలా అభినందించాలో కూడా తెలియటంలేదు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?.... మా వదిన సంగతా!... సరే సరి. మా అన్నయ్య అస్సలు మాట్లాడడు. మాట్లాడాడంటే తూటాలే. వాళ్ళిద్దరి వల్లా ప్రయోజనముండదంటే వినకుండా రెండురోజులు వేస్ట్ చేయించావు. ఆ ప్రబుద్ధునికి... అదే మా అన్నయ్యకు నా చిన్నతనం ఫోటో గురించి ఏం తెలుసు. ఒకవేళ తెలుసుండినా వాడి జీవిత సమస్యలతో ఎప్పుడో మరిచిపోయి వుంటాడు" అన్నాడు సుబ్బారావు.

"ఆయనను చులకన చేసి మాట్లాడవద్దు. అసలాయన స్టోరీ తెలుసా నీకు?..." అంది






శ్రీవల్లి.

"అబ్బే! తెలీదు.... మొహంచూడు. మా అన్నయ్య స్టోరీ నాకు కాకుండా ఇంకెవరికి తెలుస్తుంది?"

"అంత మంచితనం... స్త్రీల పట్ల అతని కున్న గౌరవం రాజీధోరణి... ఇవ్వన్నీ అతన్ని చూసి చాలా నేర్చుకోవాలి. అతన్ని ఆదర్శంగా తీసుకోవాలి... ఈ మగాళ్ళందరూ..."

"ఆపు!... ఆపు!! ఎక్కడికో వెళ్ళకు. ఏమిటో ఆదర్శగీతాలు నేర్చుకోమంటున్నావు. ఇప్పుడు అర్జంటుగా నేను వెన్నెముక విరగ్గొట్టుకుని నిన్ను వేరే చవటకిచ్చి పెళ్ళి చేస్తే నేనూ మంచి వాడినయిపోవాలి.... అంతే కదా! అదిగో ఆ లారీ కింద బోర్లా పడుకోనా?" వెటకారంగా అన్నాడు సుబ్బారావు.



"ఛీ! ఏమిటా మాటలు... అదికాదు... మీ అన్నయ్య..."

"చూడమ్మా శ్రీవల్లీ! పుట్టినప్పటినించి త్యాగ శీలురు, ఆదర్శమూర్తులు కావాలంటే కుద రదు. కొన్ని పాఠాలు మనం నేర్చుకుంటాం. కొన్ని పాఠాలు జీవితం నేర్పుతుంది."

"ఆ టైం వస్తే ఎలా జీవించాలన్నది జీవిత మే నిర్ణయిస్తుంది. తప్ప వాళ్ళలాగే... వీళ్ళలాగే అంటూ ఆదర్శగీతాలు, నీతిసూత్రాలు నావల్ల కాదు... సరేనా టాపిక్ మార్చు... మూడ్ మార్చుకో. ఐస్‌క్రీం తిందామా?"

"అదే మరి వెధవవేస్టు నువ్వూ. ఓ వైపు ముసురు పట్టుకు చస్తూ... గొడుగేసుకుని నేనొస్తే ఐస్‌క్రీం తిందామా... ఈత కొడ దామా? అంటావు. మిరపకాయ బజ్జీలు తిందాం పద" కసురుకుంటూ అంది శ్రీవల్లి.

"మనం వేరేవాళ్ళ జీవితాలనూహించు కుని... వాళ్ళను మనలో పరకాయ ప్రవేశం చేయించుకుంటే ఇదిగో ఇలాగే వానలు ఎండ లుగానూ వెన్నెల రాత్రులు మండే రాత్రులు గానూ తేడాలు తెలియకుండా మారిపోతాయి" అన్నాడు సుబ్బారావు.

"సరే సరే ఈ వారం మీ రెండో అక్కగారి ఊరు వెళదాం."



"అమ్మో!"

"ఏం ఎందుకలా భయపడ్డావ్?"

"ఆమెకు పూజలు, వ్రతాలు, నోములు తప్ప మిగతావేమీ పట్టవు. ఆమెవల్ల నీకు పిసరంతా సమాచారం కూడా దొరకదు. అసలా మహా తల్లి మాకు అక్క అన్నమాటేగానీ... ఆమెను మా అమ్మానాన్నలు కూడా ఒక్కరోజు కూడా భరించలేరు. నేనయితే ఓ గంటకూడా భరించ లేను. ప్లీజ్, ఆమె దగ్గరకు మాత్రం వద్దు. అది తప్ప ఇంకేదయినా అడుగు" అన్నాడు సుబ్బారావు చేతులు పట్టుకుని బ్రతిమిలా డుతూ.

అతని చేతులు విదిలించి కొట్టింది శ్రీవల్లి.

"అది తప్ప ఇంకేమిటి నా బొంద అడి గేది?"

(సశేషం)





కథ

మైక్ పిచ్చి

కోనె నాగ వెంకట ఆంజనేయులు
9290660220

నాటి నవ్వులు

కొంతమందికి కొన్ని రకాల పిచ్చి ఉంటుంది. కొందరికి డబ్బుపిచ్చి, మరి కొందరికి అమ్మాయిల పిచ్చి అయితే ఇంకొంతమందికి పదవి పిచ్చి - ఇలా పిచ్చిలో అనేక రకాలు.

పిచ్ - పిచ్చి పిచ్చిగా తడిసిపోయినా ఆడతామని దెబ్బలాడి మరీ అదే క్రికెట్ - చూసే, వినే పిచ్చి కూడా చాలా ఎక్కువ మందికి ఉందనేది మీకూ తెలుసు.

వీటన్నిటినీ మించిన పిచ్చి మరొకటుంది.

అదే మైక్ పిచ్చి... కొంతమందికి మైక్ పట్టుకుంటే ఓ పట్టాన వదలబుద్ధి కాదు. ఎవరి పిచ్చి వారికానందం మరి.

సరిగ్గా అటువంటి పిచ్చే పట్టింది ఉదయ్‌శంకర్‌కి.



ఆ మధ్య ఎక్కడో ఏదో కల్చరల్ ప్రోగ్రాంకి వెళ్ళేడు ఉదయ్‌శంకర్.

అక్కడ కొందరు కార్యకర్తలు స్టేజ్ మీదకి వచ్చి జరుగుతున్న, జరుగబోయే కార్యక్రమాల్ని గురించి హుందాగా మైక్‌లో ఎనౌన్స్ చెయ్యడం చూశాడు. అదిగో అప్పట్నుంచి స్టేజ్ ఎక్కి మైక్‌లో మాట్లాడాలనే కోరిక ఉదయ్‌శంకర్‌లో ఉదయించి ఇంతై... యింతింతై ... వటుడింతై ... సారీ ... వటుడింతై అన్నట్లు పెరిగి పెరిగి వటవృక్షమంత ఎత్తు ఎదిగిపోయింది.

స్టేజ్ ఎక్కి మైక్‌లో మాట్లాడుతుంటే ఎంత థ్రిల్లింగ్‌గా ఉంటుందో, ఆ క్షణంలో ఆడిటోరియంలో ఉన్న వాళ్ళందరి కళ్ళూ మైక్ ముందున్న ఆ వ్యక్తి మీద కేంద్రీకరించబడి ఉండడం నిజంగా ఎంత గొప్ప విషయం.

ఆ వ్యక్తికి ఎంత గర్వ కారణం.

అబ్బ! తలచుకుంటూంటేనే నోరూరిపోతోంది. ఎప్పటికైనా స్టేజ్ ఎక్కి ఎనౌన్స్‌మెంట్లు ఇవ్వాలన్న కోరిక ఉదయ్‌శంకర్‌లో బలంగా పోతుకుపోతూ వేళ్ళు తన్నింది.

చివరికి ఎలాగైతేనేం ఉదయ్‌శంకర్ కోరిక తీరే రోజు దగ్గర పడింది...

ఆ విధంబెట్టిదనిన...

గణపతి నవరాత్రుల సందర్భంగా మా ఉక్కు నగరంలో ఉద్యోగుల, వారి కుటుంబ సభ్యుల, బంధుమిత్ర సపరివారల వినోదం కోసం ఆ తొమ్మిది రోజులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయబడ్డాయి.

అష్టకష్టాలు పడి కమిటీ మెంబర్ల కాళ్ళావేళ్ళా పడి గడ్డాలు ఉన్నవాళ్ళ గడ్డాలు పట్టుకుని... ప్రతిమలాడి... తను కూడా పూజా కమిటీ మెంబరయ్యాడు ఉదయ్‌శంకర్.

హమ్మయ్య! ఎలాగైతేనేం మెంబరయ్యాడు.

ఇంక మైక్ దొరకబుచ్చుకోవడమే తరువాయి అని చంకలు గుద్దుకోబోయే అందరి ఎదుటా అలా చెయ్యడం బాగుండదు. ఇంటికి వెళ్ళిన తరువాత గుద్దుకోవచ్చులే అని అప్పటికి ఆ కార్యక్రమాన్ని వాయిదా వేశాడు ఉదయ్‌శంకర్.

గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా మొదలయ్యాయి...తృష్ణ గ్రౌండ్స్‌లో.

కళ్ళు మిరమిట్లు గొలిపే రంగు రంగుల లైట్ల వెలుగులో రాత్రిళ్ళు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా మొదలయ్యాయి.

నాటకాలు, ఆర్కెస్ట్రాలు, మిమిక్రీలు, డాన్స్‌లు, మేజిక్ షోల ఏర్పాట్లతో హడావుడిగా వున్నారు కమిటీ మెంబర్లందరూ. హడావుడిగా స్టేజ్ ఎక్కి లెక్క లేనన్ని ఎనౌన్స్‌మెంట్లు గుప్పించేస్తున్నారు.

ఎనౌన్స్‌మెంట్లతో గుభాళించిపోతోంది గ్రౌండంతా.

కానీ అదేం దురదృష్టమో కాని మిగతా

కమిటీ మెంబర్లందరూ ఏదో ఒక మిషతో స్టేజ్ ఎక్కి మైక్ పట్టుకుని ఎనౌన్స్ చేస్తున్నారు కాని ఉదయ్‌శంకర్‌కి మాత్రం స్టేజ్ ఎక్కే అవకాశం రావడం లేదు.

తలబాదుకుంటున్నాడు అతను.

అవకాశం మన దగ్గరకు రానప్పుడు మనమే అవకాశాన్ని వెతుక్కుంటూ వెళ్ళాలి కదా మరి!

అలాగే మైకు మన దగ్గరకు రానప్పుడు మనమే మైకు దగ్గరకు వెళ్ళాలి. తప్పదు.

అందుకోసం ఒక దారుణమైన ఉపాయం కూడా ఆలోచించాడు ఉదయ్‌శంకర్.


ఆ రోజు రాత్రి పదకొండున్నరకు సాంస్కృతిక కార్యక్రమాలు ముగిసిన తరువాత ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆ మరునాడు ఉదయం అయిదు గంటలకు అల్లారం పెట్టుకుని నిద్రలేచి పూజా గ్రౌండ్‌లోకి పరుగుపెట్టాడు ఉదయ్‌శంకర్.

జాగింగ్‌కో, రన్నింగ్‌కో కాదండోయ్. వినండి... సారీ! చూడండి ఏం చేస్తాడో...

హడావుడిగా గ్రౌండ్‌లోకి పరిగెత్తి కుర్చీల క్రింద వెతకడం మొదలుపెట్టాడు. మొత్తం కుర్చీలన్నీ కలయదోడి తను అనుకున్నది సాధించేడు ఉదయ్‌శంకర్.

రాత్రి ఎప్పుడవుతుందా అని చకోర పక్షిలా, నిరక్షరకుక్షిలా (అంటే ఏమిటో నాకూ తెలీదు. ప్రాస కుదిరింది కదా అని వాడేను. బాగుండకపోతే కాన్సిల్ చేసేయండి) ఎదురుచూడ సాగాడు. ఆఖరికి రాత్రయింది.



సాంస్కృతిక కార్యక్రమాలు మొదలు పెట్టడానికి హడావుడి చేస్తున్నారు నిర్వాహకులు.

ఈలోగా సందు చూసుకుని మైక్ కొట్టేయడానికి గోతికాడ నక్కలా పొంగలు కాదుస్తూ ఎదురు చూడసాగాడు ఉదయ్‌శంకర్.

ఆ రోజు జరుగబోయే సాంస్కృతిక కార్యక్రమాల గురించి మైక్‌లో ఎనౌన్స్ చేసి మైక్ అక్కడ పెట్టేసి నిష్క్రమించాడో కమిటీ మెంబర్.

ఆ అవకాశం కోసమే ఎదురుచూస్తున్న ఉదయ్‌శంకర్ హడావిడిగా స్టేజ్ మీదకు పరుగెత్తి కోహినూర్ వజ్రాన్ని చేతిలోకి తీసుకున్నట్లు ఆప్యాయంగా మైక్ చేతిలో స్లో మోషన్‌లోలా మీ కళ్ళ ముందు కనబడుతోంది కదూ?



గ్రౌండ్‌లో ఇసుకేస్తే రాలనంతమంది జనం ఉన్నారు. మైక్ దొరకపుచ్చుకుని గొంతు సవరించుకుని ఎనౌన్స్ చేయడం మొదలుపెట్టాడు ఉదయ్‌శంకర్.

"ఉక్కునగర వాసులకు విజ్ఞప్తి. నిన్నరాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ముగిసిన తరువాత గ్రౌండ్‌లో ఎవరిదో ఒక వాటర్ బాటిల్, ఓ చిన్నబాబుది ఎర్రరంగు బూటు దొరికాయి. వాటి స్వంతదారులు గుర్తులు తెలిపి స్టేజ్ వెనక్కి వచ్చి తీసుకోవలసిందిగా ప్రార్థన. మా కార్యక్రమాలు మరికొద్ది నిమిషాలలో ప్రారంభమవుతాయి" అందాగా, అతి సహజంగా



ఎనౌన్స్ చేసి మైక్ రెస్ట్ మీద ఉంచి స్టేజ్ దిగేడు గంభీరంగా ఉదయ్‌శంకర్.

ఆనందంతో మనసంతా పులకించిపోతోంది తనికి. తన ఇన్నాళ్ళ, ఇన్నేళ్ళ కోరిక ఈ రోజు తీరినందుకు ఎంతో పొంగిపోయేడు. సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యేడు.

ఆ తరువాత ఆ వాటర్ బాటిల్, బూటు స్వంతదారులు వచ్చి గుర్తులు చెప్పి తీసుకున్నారు ఉదయ్‌శంకర్ నుండి.


ఆనాటి సాంస్కృతిక కార్యక్రమాలు దిగ్విజయంగా ముగిశాయి. ఇలా అని ఉదయ్ శంకర్ తనకు తనే చెప్పుకున్నాడు.

ఆ మరునాడు ఉదయం మళ్ళీ అల్లారం పెట్టుకుని నిద్రలేచి గ్రౌండ్‌లోకి పరుగుతీశాడు ఉదయ్‌శంకర్. హడావిడిగా కుర్చీల క్రింద దూరిపోయి వెతకసాగాడు.

మరి ఆ రోజు ఉదయ్‌శంకర్ దురదృష్టమో, మైక్ చేసుకున్న అదృష్టమో గాని ఒక్క చెప్పు కాని, వాటర్ బాటిల్ గాని కనీసం లేడీస్ జేబు రుమాలు గానీ దొరకలేదు ఉదయ్‌శంకర్‌కి.

ఆ వెతకడంలో కుర్చీలు తన్నేసుకుని మోకాళ్ళకు దెబ్బలు మాత్రం తగిలించుకున్నాడు. అయినా ఆశ వీడకుండా మళ్ళీ కుర్చీలన్నీ క్రిందా మీదా పడేసి వెతికాడు.

ప్చ్! ఏం లాభం లేకపోయింది. ఆ రోజు మైక్‌లో మాట్లాడే అవకాశం దొరకనందుకు చాలా విచారపడిపోయాడు ఉదయ్ శంకర్.



ఏం చేయాలి?... ఎలా?... ఎలా?...

ఒక్కసారి ఏ పిచ్చైనా ఎక్కితే అంత త్వరగా తగ్గదు కదా ఎవరికైనా?

బుర్ర బద్దలయ్యేలా... ఒళ్ళు వేడెక్కేలా ఆలోచించగా... అలోచించగా... చించగా... ంచగా... చగా... గా... మెరుపులాంటి ఆలోచన వచ్చింది ఉదయ్‌శంకర్‌కి.

భేష్! అదీ అయిడియా అంటే!

గ్రౌండ్‌లో ఎవరైనా చిన్న పిల్లలు తల్లిదండ్రుల నుండి విడిపోయి ఏడుస్తూ తిరుగుతుంటే ఆ పిల్లల్ని చూసిన వాళ్ళు కార్యకర్తలకు అప్పగిస్తే ఆ కార్యకర్త స్టేజ్ ఎక్కి మైక్‌లో ఆ పిల్లవాడు తప్పిపోయినట్లు ఎనౌన్స్ చెయ్యడం జరుగుతోంది అప్పుడప్పుడూ.

అలా ఎవరైనా పిల్లవాడు తప్పిపోయి తనకు దొరికితే వాణ్ణి పట్టుకుని స్టేజ్ ఎక్కి మైక్‌లో ఎనౌన్స్ చెయ్యవచ్చునని ఉదయ్‌శంకర్ ఆశ.

అందుకే చిన్న పిల్లలెవరైనా తప్పిపోయి ఏడుస్తూ తిరుగుతున్నారేమోనని గ్రౌండ్ అంతా కలయతిరుగుతూ వెతకడం మొదలుపెట్టాడు.

కానీ దురదృష్టం ఉదయ్‌శంకర్ వెన్నంటే వుంది. ఏ పిల్లవాడు తప్పిపోయి తిరగడంలేదు గ్రౌండ్‌లో. ఈ ఉపాయం కూడా పారలేదే!

విచారం పట్టుకుంది ఉదయ్‌శంకర్‌కి. ఇక తనకి మైక్ పట్టుకునే అవకాశం లేనేలేదా? అప్పుడే అయిదు రోజులు గడచిపోయాయి పూజా కార్యక్రమాలు మొదలై. మరో నాలుగు రోజులు మాత్రమే జరుగుతాయి.


హతవిధీ! ఇప్పుడేం చెయ్యడం?

మళ్ళీ బుర్ర వేడెక్కించుకోవడం మొదలు పెట్టాడు ఉదయ్‌శంకర్.

ఆలోచనలతో వేడెక్కిన వేడివేడి బుర్రలోంచి పొగ్గొతే వస్తున్నాయి గానీ అయిడియా మాత్రం ఊడి రావడం లేదు.

హఠాత్తుగా మెరుపులాంటి మరో ఆలోచన వచ్చింది ఉదయ్‌శంకర్‌కి.

అయ్యబాబోయ్! ఎంతెంత మంచి మంచి ఐడియాలొచ్చేస్తున్నాయోనని... సంబరపడిపోయాడు ఉదయ్‌శంకర్.



ఆ రోజు రాత్రి 'గానతరంగిణి' వారి ఆర్కెస్ట్రా ప్రోగ్రాం జరుగుతోంది. ప్రోగ్రాం మొదలైన తరువాత ఆడవాళ్ళ కుర్చీల వైపు తిరగడం మొదలుపెట్టాడు ఉదయ్‌శంకర్.

ఒక తల్లి ఒడిలో మూడేళ్ళ బాబుని కూర్చో బెట్టుకుని ఆర్కెస్ట్రా ప్రోగ్రాం తన్మయత్వంతో చూస్తోంది. ఆ కుర్రాడు తల్లి ఒడిలోంచి బయటపడడానికి ప్రయత్నిస్తూ ఉదయ్‌శంకర్ కళ్ళబడ్డాడు. ఉదయ్‌శంకర్ కళ్ళు మెరిశాయి.

జేబులోంచి ఓ చాక్లెట్ తీసి ఆ కుర్రాడికి కనిపించేలా చేతిలో పట్టుకున్నాడు.

కాసేపటికి ఆ కుర్రాడి దృష్టి ఉదయ్‌శంకర్ చేతిలోని చాక్లెట్ మీద పడింది.

మెల్లగా తల్లి ఒడిలోంచి జారి నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ ఉదయ్‌శంకర్ దగ్గ రకు వచ్చేశాడు ఆ కుర్రాడు.

ప్రోగ్రాంలో లీనమై ఉన్న ఆ కుర్రాడి తల్లి ఇదేమీ గమనించే స్థితిలో లేదు.

ఆ కుర్రాడు దగ్గరికి రాగానే వాడి చేతికి చాక్లెట్ ఇచ్చి వాణ్ణి భుజాన వేసుకొని స్టేజ్ వైపు పరుగుతీశాడు ఉదయ్‌శంకర్.

ఆర్కెస్ట్రా వాళ్ళు అప్పుడే ఓ పాట ముగించి మరోపాట అందుకోవడానికి సిద్ధంగా ఉన్నా రు. వాళ్ళ చేతిలోంచి మైక్ లాక్కున్నాడు ఉదయ్‌శంకర్.

ఎనౌన్స్‌మెంట్ మొదలుపెట్టాడు.

"పురజనులకు విజ్ఞప్తి. ఎవరో చిన్నిబాబు.




నా భుజం మీద ఉన్నాడు. మూడేళ్ళుంటాయి. ముద్దుగా ఉన్నాడు. తప్పిపోయి ఏడుస్తున్నాడు. ఈ బాబూ తల్లిదండ్రులు స్టేజ్ మీదకు వచ్చి తీసుకెళ్ళవలసిందని ప్రార్థన."

ఎనౌన్స్ చేసి కాసేపు స్టేజ్ మీదనే ఉండి పోయాడు ఉదయ్‌శంకర్ అక్కినేనిలా ఫోజులు కొడుతూ.

కాసేపటికి ఆ కుర్రాడి తల్లి గుండెలు బాదు కుంటూ స్టేజ్ మీదకు వచ్చి 'థ్యాంక్స్' చెప్పి కుర్రాణ్ణి తీసుకుని వెళ్ళిపోయింది సంబరంగా.

అతి హుందాగా స్టేజ్ దిగాడు ఉదయ్ శంకర్.



ఈ పద్ధతి చాలా లాభసాటిగా అనిపించింది ఉదయ్‌శంకర్‌కి.

ఆ మరునాటి రాత్రి నుండి జేబునిండా చాక్లెట్లు పోసుకుని ఇదే పద్ధతిలో పిల్లల్ని తల్లి దండ్రుల నుండి వేరుచేసి హుషారుగా స్టేజ్ ఎక్కి మైక్ అందేసుకుంటున్నాడు ఉదయ్ శంకర్.

మరొకరోజు ఇలాగే చిన్నపిల్లల వేటలో ఉండగా ఎవరో రెండేళ్ళ కుర్రాడు చీకట్లోంచి పాక్కుంటూ ఉదయ్‌శంకర్ వైపు వస్తున్నాడు.

ఆ చీకటిలో ఉదయ్‌శంకర్ కళ్ళు మెరి శాయి. అబ్బ వెదకబోయిన తీగ కాలికి తగి లింది. ఏమి నా భాగ్యం అని సంబరపడుతూ దగ్గరికి వచ్చిన ఆ కుర్రాణ్ణి చటుక్కున చంకనే సుకుని స్టేజ్ వైపు పరుగుతీశాడు.



స్టేజ్ మీద ఒక హాస్యనాటకం ప్రదర్శించ బడుతోంది అతి సీరియస్‌గా, కడు రమ్యంగా.

ప్రేక్షకులంతా నాటకంలో లీనమైపోయి ఉన్నారు. నాటకాన్ని మధ్యలో ఆపుచేయించి మైక్ దొరకపుచ్చుకున్నాడు ఉదయ్‌శంకర్.

నటీనటులు బిక్కముఖాలు వేసుకుని స్టేజ్ మీద ఓ మూలకి పోయి నిలబడ్డారు.

"ఒక విజ్ఞప్తి. ఎవరో చిన్న కుర్రవాడు, రెండేళ్ళుంటాయి. తప్పిపోయి ఏడుస్తున్నాడు. నా చేతిలో ఉన్నది ఆ బాబే. ఈ బాబు తల్లిదండ్రులు వచ్చి బాబుని తీసుకువెళ్ళవసిందిగా ప్రార్థన. మరొక విజ్ఞప్తి దయచేసి మీ పిల్లల్ని వదలివేయకుండా ఒళ్ళోనే కూర్చోబెట్టుకోమ్మని మరీ మరీ ప్రార్థిస్తున్నాము" గంభీరంగా ఎనౌన్స్ చేశాడు ఉదయ్‌శంకర్.

రెండు నిమిషాల తరువాత స్టేజ్ మీదకు వచ్చిన భార్యను చూసి "ఏమిటి సంగతని సైగ చేసి అడిగేడు.

ఆమె ముఖం ధుమధుమలాడుతోంది.

"మీ తెలివి తెల్లారినట్లే ఉంది. వాడు మన బాబేనండి. మీరు వాణ్ణి చూసే ఎత్తుకున్నారనుకున్నాను. ఇలా పట్టుకుపారిపోతారనుకోలేదు. ఇలా ఇవ్వండి" అంటూ అతని చేతిలోంచి బాబుని విసురుగా లాక్కుందామె.

ఆమె అనిన ఈ మాటలు మైక్‌లోకి జొరబడిపోయి గ్రౌండ్‌లో ఉన్న ప్రతి ఒక్కరి చెవికి చేరిపోయి, గ్రౌండంతా నవ్వుల పువ్వులు పూశాయి. అందరూ కేరింతలు కొట్టారు.

కొందరు ఉత్సాహవంతులు ఈలలు కూడా వేశారు. హాస్యనాటకం కంటే ఈ సంఘటనే అందరినీ అలరించింది. అయిదు నిమిషాల పాటు గ్రౌండంతా నవ్వుల్తో నిండిపోయింది.

ఆ మరునాటి నుండి ఉదయ్‌శంకర్ ఎక్కడ కనిపిస్తే అక్కడ మా ఉక్కునగర వాసులంతా – స్త్రీ, పురుష, వృద్ధ, బాలబాలికలనే భేదం లేకుండా నోటికి చెయ్యో, రుమాలో అడ్డు పెట్టుకుని ముసి ముసి నవ్వులు నవ్వుకోసాగారు.

అతని మైక్‌పిచ్చి గురించి అందరికి తెలిసిపోయింది.

ఈ దెబ్బతో ఉదయ్‌శంకర్ మైక్ పిచ్చి వదలిపోయిందని వేరే చెప్పనవసరం లేదు కదూ?

(ఆంధ్రభూమివార పత్రిక, 08.7.1993)



అందమైన కార్టూన్ ప్రపంచం.



నేను కార్టూన్లు వేయడం ప్రారంభించిన తొలిరోజుల్లో సత్యమూర్తిగారి కార్టూన్లు ఒక ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్‌తో నన్ను అమితంగా ఆకట్టుకునేవి. ఇండియన్ ఇంక్ కూడా ఎక్కడ దొరుకుతుందిరా బాబూ అని బుర్రగోక్కుంటున్న సమయంలో పాళీలతో... డిఫరెంట్ పేటర్న్‌లతో... పొందికగా, శాస్త్రీయంగా నిబ్స్‌తో ఆయన బొమ్మలు చూడముచ్చటగా వుండేవి. అందమైన కార్టూన్ బొమ్మలు ఆయన ప్రత్యేకత. ఆయన వేసిన అడ్వర్టయిజ్‌మెంట్ కార్టూన్లు ఇప్పటికీ కొన్ని గుర్తువున్నాయి. బహుశా తెలుగులో ఇటువంటి ప్రయోగాలకు ఆయనే ప్రారంభకులేమో.



కార్టూన్లు వేయడం ఎలా? అనే పుస్తకం ఇప్పటికీ చక్కగా చదువుకోవలసిన రిఫరెన్స్ పుస్తకం. అందమైన కార్టూన్ ప్రపంచాన్ని, అమ్మాయిలను, అబ్బాయిలను, పిల్లలను సృష్టించిన ఆయన కార్టూన్ ప్రపంచం ఏ పాశ్చాత్య యానిమేషన్ ప్రపంచానికి తీసిపోదు.

కళాకారుడికి విశ్రాంతి,తృప్తి లేదని అన్నట్లుగా ఆయన ఇప్పటికీ చక్కటి కార్టూన్లు వేయడం బాగుంది. ఆయనకు గౌరవప్రదమైన పురస్కారాలు మరిన్ని అందాలని, సంతోషంగా వుండాలని హాస్యానందంగా కోరుకుంటూ... **–హరి**, విశాఖపట్నం

శ్రీ బి.వి.సత్యమూర్తిగారు నేను కార్టూనిస్ట్‌గా మారక ముందు నుంచి ఆంధ్రప్రదేశ్‌ను 'చదువు్రావు' పేరుతో ఏలారు.

నాకు ఒక గరువులాంటివారు. స్నేహశీలి, మంచి గుణాలన్ని పోతపోసి సత్యమూర్తిగార్ని సృష్టించాడు ఆ చతుర్ముఖ బ్రహ్మ...

ఇది సత్యం! –ఏవిఎమ్.



మరువలేని ఫోన్‌కాల్



సీనియర్ కార్టూనిస్టులలో సత్యమూర్తిగారు ఒకరు. తెలుగు పత్రికలలో వచ్చిన ఆయన కార్టూలన్నీ నేను చూశాను. ఎవరూ ఆలోచించని కొత్త కోణాల్లో కార్టూన్లు గీశారు. అయితే 2007లో నేను గీసిన ఒక కార్టూన్ చూసి బాగా గీశారంటూ ఫోన్‌చేసి నన్ను అభినందించారు. అది నేను మరచిపోలేని సంఘటన.

2013 మే నెలలో జరిగిన తలిశెట్టి అవార్డు ప్రదానోత్సవ సభలో వారిని ప్రత్యక్షంగా చూశాను. కాసేపు ముచ్చటించుకున్నాము. ఇది నేను జీవితంలో మరచిపోలేను.

–డాక్టర్ రావెళ్ళ

మంచి మిత్రుడు సత్యమూర్తి.



– బాలి

1970ప్రాంతాల్లో అనుకుంటాను.

ఆంధ్రపత్రిక వార పత్రికలను అనకాపల్లిలో మా ఇంటికి దగ్గర్లో ఉన్న సర్వకామదాంబ పార్క్‌లో ఉన్న లైబ్రరీలో తిరగేస్తూ ఉండే రోజుల్లో శ్రీ సత్యమూర్తి గారు వేసే కార్టూనే స్ట్రిప్ 'చదువుల్రావ్' కనపడేది. అది ఆ రోజుల్లో చాలామంది పాఠకుల్ని ఆకట్టుకొనేది. ఇది గ్రహించి కాబోలు ఆ పత్రిక సంపాదకీయ వర్గం 'చదువుల్రావ్' కేరక్టర్స్‌తో చిన్న జోక్ చేర్చి రంగుల్లో ముఖచిత్రంగానూ వేశారు.

అవి చూసి అబ్బో అనుకున్నాను.

ఆ తరువాత రోజుల్లో అక్కడక్కడా పత్రికల్లో సత్యమూర్తిగారు చాలా కంపెనీలకు (ప్రెస్టేజ్ కుక్కర్స్) కార్టూన్లతో వేసిన ప్రకటనల డిజైన్లను చూశాను.

థిక్ అండ్ థిన్‌లైన్లతో వేసే ఆయన రేఖల్లో ఆయనదో ప్రత్యేక శైలి. ఇప్పటికీ అవే రేఖలు. అవే అక్షరాలు.

ఆ తరువాత కొన్ని సంవత్సరాలకు 'ఈనాడు' దినపత్రికలో కార్టూనిస్ట్‌గా నేను చేరి, విశాఖపట్నంలో ఒక సంవత్సరం పని చేసిన తరువాత మూటా, ముల్లే సర్దుకొని హైదరాబాద్ వెళ్ళాం. ఇక ఆ రోజుల్లో అబిడ్స్‌లో ఉండే ఆ ఆఫీస్‌కు చాలామంది కార్టూనిస్ట్ లు వచ్చేవారు. వారితో నాకు పరిచయాలు కలిగేవి. అలా వచ్చిన వారిలో సత్యమూర్తి గారు ఒకరు. మంచి పర్సనాలిటీ. అందరితో కాస్సేపు సరదాగా మాట్లాడి స్కూటర్‌లో వెళ్ళిపోయేవారు. అప్పట్లో ఆయన విజయ నగర్ కాలనీలో ఉండేవారు. ఒకమారు నన్ను ఆయ నింటికి తీసుకెళ్ళిన గుర్తు. టేబుల్‌పై సగం సగం తయారు చేసిన డిజైనులుంటే, క్రింద చెత్తబుట్టలో కత్తిరించిన అక్షరాలున్నాయి. అప్పట్లో అక్షరాలను మనకు కావలసిన సైజుకే ప్రింట్స్ వేసుకొని కత్తిరించి అంటించుకోవాలి.

ఇవన్నీ ఆ ఇంట్లోని ఓ గదిలో ఉన్నాయి. అదే ఆయన స్టూడియో.

ఈ డిజైనింగ్ స్టూడియో వల్ల నెలకు ఓ పదివేలన్నా సంపాదిస్తారు" అని ఓ చిత్రకళామిత్రుడు వ్యాఖ్యానించాడు కూడా.

అది ఆ రోజుల్లో చాలా గొప్ప.

ఆ తరువాతి రోజుల్లో నేను ఈనాడు విడిచిపెట్టి ఆంధ్రజ్యోతి విజయవాడ వెళ్ళిపోయాను. యానిమేషన్‌లో అవకాశం వస్తే తిరిగి హైదరాబాద్ చేరుకొన్న తరువాత కూడా మా మధ్య గల పరిచయం అలాగే కొనసాగుతోంది. వీలు చిక్కినప్పుడల్లా లకడీకాపూల్‌లో ఉన్నవారి ఆఫీస్‌కి వెళ్ళడం కబుర్లు చెప్పుకోవడం... ఆ కబుర్లన్నీ బొమ్మలు వేసే విధానం గురించీ, పాళీలు, కలాలు, ఇంకులు గురించే... వారు అభిమానంగా ఇచ్చిన మేలురకం పాళీలు ఇంకా నా వద్ద ఉన్నాయి.

వీరి ఆంధ్రభూమిలో కార్టూన్‌లు గీయడం ఎలా? అనే ఫీచర్ పుస్తక రూపంలో వచ్చింది. ఆ పుస్తకాన్ని అభిమానంగా ఇచ్చారు సంతకం చేసి. సంతోషమే.

దానిలో చాలామంది ప్రముఖుల ముందు మాటలున్నాయి. బీరువాలో దాచిన ఆ పుస్తకం ఎదురుపడితే తిరగేస్తుంటాను. ముందు మాటలూ చదువుతాను. పేరెందుకు గానీ అందులోని ఓ ఉత్తమ ప్రముఖుడు ఇలా రాశాడు.

"... ఓ ఫీచర్ సృష్టించి దాన్ని కార్టూనిస్టుల మధ్యకు తీసుకెళ్ళి ఓ అద్భుతమైన ఓ నిశ్చల చిత్రానికి చలనం తెచ్చారు సత్యమూర్తిగారు. నా దృష్టిలో ఆయన ఓ ఇండివిడ్యువల్ కాదు... ఒక ఇండస్ట్రీ... ఆ ఇండస్ట్రీ యానిమేషన్ రంగానికి ఈ రోజు కావాలి."–అని.

గొప్పగా ఉన్నాయి ఈ మాటలు.

ఈ మాటల టోపీలూ చాలామంది ఆర్టిస్టుల తలల మీద పడ్డాయి.

అందులో ఇదొకటి.





తర్పణార్పణం

బుద్ధవరపు కామేశ్వరరావు
9848047322

"హాయ్ ! హలో ! నమస్తే... 'పిండం' టీవీ సమర్పించు 'అర్పణం' కార్యక్రమానికి స్వాగతం. నా పేరు తర్పణం. సారీ... సారీ.... పిండం టీవీ సపర్పించు తర్పణం కార్యక్రమానికి స్వాగతం... నా పేరు అర్పణ.

మా ఈ కార్యక్రమం గురించి మీకు తెలుసుకదా ! అయినా మా పిచ్చిముండా ప్రేక్షకుల కోసం... సారీ... మా ప్రియమైన ప్రేక్షకుల కోసం మరోసారి ఈ ప్రోగ్రాం గురించి క్లుప్తంగా వివరిస్తా.

మామూలుగా అయితే అన్ని టీవీ వాళ్ళు పుట్టినరోజు, పెళ్ళిరోజు, శుభాకాంక్షలు, ప్రస్తుతం జీవించి ఉన్న వాళ్ళకి చెప్పడం రివాజు. అయితే, మా 'పిండం' టీవీ మాత్రం ఈ విషయంలో ఒక అడుగు ముందుకు వేసి, సారీ...సారీ... ఒక అడుగు పైకి వేసి, చనిపోయి, పై లోకాల్లో ఉన్న మీ బంధుమిత్రులకి మీ సందేశాలు, మీరు చెప్పబోయే విశేషాలు, విషయాలు వాళ్లకి చేరవేస్తుంది...

ఇంకెందుకు ఆలస్యం, వెంటనే ఫోన్ తీసుకుని 2సార్లు LOOSE కి కొట్టండి. అదేనండి తిరగేస్తే 35007 కదా, దానిని 2 సార్లు కొట్టి మాతో మాట్లాడండి. ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్.

అదిగో అపుడే ఫోన్ రింగవుతోంది. ఎవరో చూద్దాం!


"హలో పిండం టీవీ వాళ్ల తర్పణం కార్యక్రమానికి స్వాగతం. చెప్పండి మీరు ఎవరికి సందేశం ఇవ్వాలి అనుకుంటున్నారు?"

"సందేశమా! స్మశానమా!... ఒసే! అప్పీ! నేనే నీ మేనత్త ఛాయాదేవిని. ఏమే మీ నాన్న నా దగ్గర తీసుకున్న రెండువేలు రూపాయలు నీకిచ్చి, సంక్రాంతి రోజున పంపుతానన్నాడు. ఫోన్ చేస్తే ఎత్తరు. ఇంటికొస్తే తలుపు తాళం వేసుంటుంది. ఎక్కడకి పోయారే మీరంతా! నా అదృష్టం బాగుండి ఈ రోజు నువ్వు ఈ టీవీ వాళ్ల ఫోనులో దొరికావు. చెప్పు మీ నాన్నకి......"

"అత్తయ్యా ! కూల్ డౌన్. ఇందులో స్వంత విషయాలు మాట్లడుకోకూడదు. మళ్ళీ నీకు అన్నీ వివరంగా ఫోన్ చేసి చెప్తా కానీ, ఈ కార్య క్రమం ద్వారా నువ్వు ఎవరికయినా సందేశం ఇవ్వదలచుకున్నావా?"

"బాగానే జ్ఞాపకం చేసావే అప్పీ! ఈ రోజునే మీ మావయ్య దుకాణం కట్టేసిన రోజు. అప్పుడే పది సంవత్సరాలు అయిపోయాయి అంటే నమ్మబుద్ధి కావడం లేదు. జీవించినంత కాలం పాపం నా చేత చావు దెబ్బలు తింటూనే ఉండేవాడు. ఆయన పోయిన తర్వాత నా చేతులకి పని తగ్గిపోయిందే అప్పీ !

ఈ రోజు ఆయన పోయిన దినం సందర్భంలో, మురళీకృష్ణ చిత్రం నుంచి ఘంటశాల



పాడిన 'ఎక్కడ ఉన్నా, ఏమయినా, నీ సుఖమే నే కోరుకున్నా' అనే పాట వేయవే అప్పీ"

"తప్పకుండా వేస్తాం, మరీ తర్వాతి కాలరు లైన్‌లో ఉన్నారు. హలో...పిండం టీవీ వాళ్ళ తర్పణం కార్యక్రమానికి స్వాగతం. చెప్పండి... మీ సందేశం ఎవరికి?"

"అమ్మాయ్! నా పేరు సందేహాల రావు. మీ ప్రోగ్రాం చూస్తున్నా, బాగానే ఉంటోంది. మీ ఛాయాదేవి అత్తయ్య నిన్ను బాగానే ఝాడించి వదిలేసింది...

"అవునమ్మాయ్! ఈ రోజు మా అవిడ సూర్యకాంతం పోయిన రోజు. సరిగా ఈ రోజుతో 10సంవత్సరాలు పూర్తి అయ్యాయి. ఇకపోతే మా ఆవిడకి టీవీ సీరియల్స్ అంటే తెగపిచ్చి. ముఖ్యంగా మీ టీవీలో సాయంత్రం పూట రెగ్యులర్‌గా వచ్చే 'జిడ్డుమూకుడు' సీరియల్ క్రమం తప్పకుండా చూసేది. సుమారు 8 సంవత్సరాలు ఆ సీరియల్‌ని చూసింది. ఈ లోగా పై నుంచి కబురు రావడంతో టీవీ కట్టేసి పైకి వెళ్లిపోయింది...."

"సార్ ! అ జిడ్డుమూకుడు సీరియల్ అంటే అంత ఇష్టమా మేడం గారికి?"

"భలే దానవమ్మా! అది చనిపోయిన రోజున కాకికి 'పిండం' పెడదామని ట్రై చేస్తే– అప్పట్టే 'పిండం' అంటే మీ టీవీ కాదమ్మా... ఒరిజినల్ పిండమే... ఒక్క కాకి కూడా రాలేదు. మా కుటుంబ సభ్యులు అందరమూ ట్రై చేసాం. అయినా ఫలితం శూన్యం. ఈ లోగా మా పక్కింటి పార్వతమ్మ వచ్చి, అన్నయ్యగారూ! సూరమ్మ వదినకి ఆ జిడ్డు మూకుడు సీరియల్ అంటే ప్రాణం కదా! ఇప్పుడు ఆ సీరియల్ వచ్చేటైము కూడా అయ్యింది. ఒకసారి ప్రయత్నించి చూడండి అని చెప్పగానే మా పెద్దవాడు డాబా మీద టీవీ పెట్టి దాని ముందు ఒక జిడ్డు మూకుడు పెట్టి... టీవీలో ఆ జిడ్డుమూకుడు సీరియల్ పెట్టగానే, ఎక్కడ నుంచో ఒక కాకి వచ్చి, రయ్యిమని ఆ పిండాన్ని తన్నుకుపోయింది. అంత ఇష్టం ఆ సీరియల్ అంటే మా ఆవిడికి"








"గ్రేట్... గ్రేట్! సూపర్... సూపర్! బావుంది... బావుంది! వంద రోజులు గ్యారంటీ. సారీ... సారీ అలవాటులో పొరపాటు. ఇంతకీ సూరమ్మగారికి ఏ సందేశం ఇద్దామనుకుంటున్నారు?"

"సందేశమూ లేదు సుఖ విరేచనము లేదు కానీ, చచ్చి 10సంవత్సరాలు అయినప్పటికీ కూడా ప్రతి రోజూ రాత్రి కలలోకి వచ్చి ఆ సీరియల్ ఎంత వరకు వచ్చింది? హీరోయిన్ ఏమయ్యింది? ఇలాంటి ప్రశ్నలతో నన్ను చంపేస్తోందనుకో !"

"చూసారా ! ఆ సీరియల్ అంటే ఆవిడకి ఎంత అభిమానమో?"

"అభిమానమా! ఆవకాయా! అంతకీ ఎన్నో సార్లు చెప్పి చూసా! కాంతం నువ్వు పోయిన

తర్వాత ఈ పది సంవత్సరాలలో కథ ఏమీ జరగలేదు కానీ హీరోయిన్ వేషం వేసిన అమ్మాయిలు నలుగురు మారారనీ, ఒక మ్మాయి పెళ్లి చేసుకోని ఫారిన్ వెళ్ళిపోతే, రెండో అమ్మాయికి ఆ డైలాగులు చెప్పి చెప్పి పిచ్చెక్కి మెంటల్ హాస్పిటల్‌కి , మూడో అమ్మా యికి మూడ్ వచ్చేసి పాత్రలో లీనమయ్యి, ఎదురుగా ఉన్న పనిమనిషి అమ్మాయిని అట్లు పెనంతో కొడితే, ఆ పనిపిల్ల గుటుక్కుమంటే జైలుకి వెళితే... చేసేది లేక ఆ సీరియల్ ప్రొడ్యూసర్ వాళ్ల ఆవిడతో సీరియల్ లాగిస్తున్నాడని చెప్పి చూసా... అయినా కానీ తృప్తి లేకుండా నన్ను కూడా తన దగ్గరికి వచ్చేయమని, ఆ పది సంవత్సరాల ఎపిసోడ్లని వరుసగా చెప్పమని, కలలోకి వచ్చి రోజూ చంపెస్తోందనుకో !!"



"అర్థమయ్యింది సందేహాల్రావుగారూ! ఇప్పుడు మేము మీ తరుపునుంచి, మీ శ్రీమతి గారికి జిడ్డుమూకుడు సీరియల్ 10 సంవత్సరాల ఎపిసోడ్లు వినిపించాలి, అంతేనా?"

"గట్టిపిండానివే... అందుకే 'పిండం' టీవీ వాళ్ళు నిన్ను సెలక్ట్ చేసుకున్నారు."

"థాంక్యూ... థాంక్యూ! మీరు కోరిన విధంగా ఆ సీరియల్‌ని ఆవిడకి చేరవేస్తాం...."

"హలో... హలో... అమ్మాయ్! అపుడే కాల్ కట్ చేయకమ్మా! చిన్న సందేహం ఉంది, అడగొచ్చా?"

"అడుక్కోండి ! మీ పేరే అది కదా!"

"ఏం లేదమ్మా! మేము అందించే సందేశాలు, పైలోకాల్లో ఉన్న మా వాళ్లకి ఎలా చేరవేస్తారు? పైలోకాల్లో కూడా మీ నేట్‌వర్క్ పని చేస్తుందా?"

"అంత సీన్ లేదు రావుగారూ! మా నేట్‌వర్క్ పై లోకాల్లో విస్తరించడానికి కొంచెం టైమ్ పడుతుంది. ప్రస్తుతానికైతే మీ సందేశాలని మనుషుల ద్వారానే పంపిస్తున్నాం !"

"ఆశ్చర్యంగా ఉందే... మనుషుల ద్వారా ఎలా పైలోకాలకి పంపిస్తారు?"

"వెరీసింపుల్! మాకు సిటీలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వాళ్లతో టైఅప్ ఉంటుంది. వాళ్ల నుంచి, ఆపరేషన్ ఫెయిలయ్యి, టపా కట్టేసే వాళ్ల చెవి దగ్గర, మీ లాంటి వాళ్లు పంపించ దలచుకున్న సందేశం వినిపిస్తాం. వాళ్లు పైలోకాలకి చేరుకోగానే, మీ వాళ్లని కలుసుకొని ఈ సందేశం అందచేస్తారు !"

"అద్భుతం! పరమాద్భుతం... ఈ తరహా కార్యక్రమాలతో మీ పిండం టీవీ ఇంకా వృద్ధిలోకి రావాలని కోరుకుంటున్నా!...ఏమీ అనుకోనంటే మరో చిన్న సందేహం ఉంది... అమ్మాయ్..."

"త్వరగా అడుక్కోండి చాలా మంది 'ఐకరాలు' సారీ, సారీ!... చాలా మంది 'కాలర్లు' లైన్‌లో ఉన్నారు.

"మరి, మా ఆవిడ నరకంలో ఉండి, మీరు సందేశం పంపే వ్యక్తి స్వర్గానికి వెళ్తే, అప్పుడు ఏంటి పరిస్థితి?"

"చూడండి రావుగారూ! ఇంత వరకూ ఎవరికీ రాని సందేహం మీకు వచ్చింది. అందు చేత ఆ సందేశాన్ని మీ ద్వారానే మీ ఆవిడకి చేరవేస్తాం. మీ కోరిక, ఆవిడ కోరిక కూడా తీరుతుంది. మీరు రెడీనా ?"

"..................................."

"హలో రావుగారూ! ఉన్నారా? పోయారా?





లైన్‌లోంచి. ఓకే...రావుగారి ఫోన్ కట్టయి నట్టుంది... వేరే కాలర్ లైన్‌లో ఉన్నారు... హాలో! నమస్తే! పిండం టీవీకి స్వాగతం... ఎవరు మాట్లాడుతున్నారు ?"

"మేడమ్! నాపేరు కీర్తి శేషారావ్ !"

"నమస్తే! కీర్తిశేషులు గారూ... సారీ! కీర్తి శేషారావుగారూ! ఎక్కడ్నుంచి మాట్లాడు తున్నారు?"

"స్వర్గపురి నుంచి మాట్లాడుతున్నాను!"

"అదేంటి సార్ మీ ఊరి పేరు వెరైటీగా ఉంది. నేను ఎప్పుడీపేరు విన లేదే...!"

"మా ఊరు చూడడానికి నీకు ఇంకా టైమ్ రావాలి మేడమ్"

"సరే సార్! మీరు ఎవరికి సందేశం ఇవ్వాలి అనుకుంటున్నారు?"



"భూలోకంలోనున్న నా శత్రువు పిండం పాపారావుకి !"

"కీర్తిగారూ! పిండం పాపారావ్ అంటే మా టీవీ ఎమ్.డి. గారేనా?"

"వాడే! ఎవడయితే పిచ్చి పిచ్చి కార్యక్రమా లతో ప్రేక్షకులకు పిచ్చి ఎక్కించి పిచ్చాసుపత్రి డాక్టర్లకి చేతినిండా పిచ్చగా పని కలిపిస్తు న్నాడో, క్షుద్రపూజలు, చేతబడులు మీద కార్య క్రమాలు రూపొందించి యువతని నిర్వీర్యం చేస్తున్నాడో... వాడే మీ ఎమ్.డి పిండం పాపా రావుకి నా సందేశం."

"ఇంతకీ పిండం పాపారావుగారికి మీరు ఇచ్చే సందేశం"

"ఇలాంటి దిక్కుమాలిన కార్యక్రమాలతో జనాన్ని పిచ్చివాళ్లని చేయవద్దని!"

"కీర్తిగారూ! చాలా తప్పుగా మాట్లాడు తున్నారు. మా ఎమ్.డి పాపారావు గారు జీవిం చి ఉన్నారు. మీకు ఎదయినా సందేహాలుంటే మా స్టూడియోకి వచ్చి వారిని సంప్రదించ వచ్చు. అంతేకానీ....."

"సారీ! నేను కిందకి రాలేను... అందుచేత పైనుంచి మీ ఈ కార్యక్రమం ద్వారా పాపా రావుకి సందేశం వినిపించమంటున్నాను."

"పై నుంచా! అంటే మీరు ఎక్కడి నుంచి



మాట్లాడుతున్నారు?"

"చెప్పాగా! పై నుంచి అంటే స్వర్గం నుంచి!"

"నిజంగానా! లేదా జోక్ చేస్తున్నారా?"

"మీకు ఆ సందేహం ఎందుకు వచ్చింది!"

"ఏమి లేదు, స్వర్గం నుంచి భూలోకానికి సందేశం పంపుతున్నారు... అంటే..."

"సింపుల్! మీరు భూలోకం నుంచి పైలోకా నికి సందేశాలు పంపగాలేనిది. మేము పై లోకాన్నించి భూలోకానికి సందేశం పంపితే తప్పుగా అనిపిస్తోందా... పిచ్చి పిచ్చి కార్య క్రమాలతో, పిచ్చి పిచ్చి వేషాలు వేయకుండా వెంటనే ఫోన్ పెట్టెయ్!!!!"

".................ఉ."

"హలో! లైన్‌లో ఉన్నావా? పోయావా?"

"......................."





కార్టూన్ల తాయెత్తు కానుకగా ఇచ్చి దీవించిన ఆత్మీయులు - చదువుల్రావు



ఓం శ్రీ సాయిరాం.... మన సత్యమూర్తిగారి గురించి అనుకోవాల్సివస్తే, ఇలానే ప్రారంభించాలనిపిస్తుంది. అయన అంత గొప్ప సాయి డివోటీ కావడమే అందుకు మొదటి కారణం కాగా, దీన్ని నేను ప్రశాంతినిలయం ఆవరణలో కూర్చొని రాస్తున్నా నన్నది రెండో కారణం.

నాకు శ్రీ గోపులుగారు పరమగురువు, శ్రీ బాపు తొలి గురువులు కాగా, నా మలి గురువు శ్రీ సత్యమూర్తిగారే.



1959-60 ప్రాంతాల్లో, నేను ఆంధ్ర సచిత్రవారపత్రిక్కి వీరాభిమానిగా వుండే రోజుల్లో, బాపూగారి 'ఎప్పుడూ ఇంతే' కార్టూన్ల కోసం, ఆంధ్రప్రభ దినపత్రికలో వచ్చే ఆయన 'మన వాళ్ళు' పాకెట్ కార్టూన్ల కోసం ఎంతగా పడి చచ్చేవాణ్ణో, అంత గాఢంగానూ మన సత్యమూర్తిగారి 'చదువుల్రావు' ఫుల్ పేజీ కార్టూన్ల కోసం కూడా మొహం వాచిపోయే వాణ్ణి. అప్పట్లో కనబడే వాళ్ళిద్దరి కార్టూన్లను చూస్తూ, వారికి ఏక లవ్య శిష్యుడిగా వారి బొమ్మల్ని అనుకరించి గీయడానికి ప్రయత్నిస్తూ... నా కార్టూన్ల అ ఆ లు దిద్దుకునే వాణ్ణి.

చివరికి, వాళ్ళిద్దరి తరహాల ప్రభావం కనిపించే కార్టూన్ల శైలి నాదయింది. నాకు కనబడ్డ ప్రతి బాపు బొమ్మనీ, కార్టూన్ని ఎలా జాగ్రత్త పరిచానో, అదే విధంగా సత్యమూర్తి గారి చదువుల్రావు కార్టూన్లని కూడా శ్రద్ధగా సేకరించేవాణ్ణి. అవన్నీ ఈ రోజుదాకా నా దగ్గర భద్రంగా వున్నాయి.

ఆయన కార్టూన్ ఫీచర్ ఆ తరం కుర్రకారుని, ముఖ్యంగా, కాలేజీ కుర్రాళ్ళని, అమ్మాయిల్ని ఉర్రూతలూగించేది.

నాటి కాలేజీ అమ్మాయిలు చదువుల్రావు క్లాస్ మేటు, గరల్ ఫ్రెండు ఐన- జయశ్రీ స్టయిల్ని కాపీ కొడుతూ, పెద్ద బొట్టు, పెద్ద చెవిరింగులతో కాలేజీ రోమియోల్ని ఆకర్షిం చేందుకు ఉవ్విళ్ళూరేవారు.

కుర్రాళ్ళుకూడా చదువుల్రావు హెయిర్ స్టయిల్ ఫాలో అయేందుకు పోటీ పడే వాళ్ళు. అలాగే లెక్చరర్లకి ఆయన సృష్టిం

చిన 'కోడిపలావ్'లాంటి నిక్‌నేమ్స్ తగిలించి అల్లరిపెట్టేవారు.

కుర్రకారులో ఇంత ప్రభంజనం రేపిన ఈ సత్యమూర్తిగారెవర్రా బాబూ అనుకొని విస్తుబోతుండే నాకు, 1965లో నేనొక పని మీద హైదరాబాదు వెళ్ళడం జరిగింది. ఎలాగో కష్టపడి సత్యమూర్తిగారి ఇంటి అడ్రసు తెలుసుకొని, విజయనగర్ కాలనీలో వున్న ఆయన ఇంటికి వెళ్ళాను. తలుపు తెరవగానే ఆయన్ని చూసి, ఢమాల్‌మని ఆశ్చర్యం ముంచెత్తగా, నన్ను నేనే నమ్మలేకపోయాను. దానిక్కారణం, నాక్కనబడింది సాక్షాత్తూ సజీవంగా వున్న చదువ్రులావే.

నేన్నింకా ఆశ్చర్యపోయిన విషయమేమంటే, ఆయన చదువ్రులావు కార్టూన్లలో కనబడే హీరోయిన్ జయశ్రీ, సత్యమూర్తిగారి నిజ జీవిత భాగస్వామి జోగీశ్వరిగారు మక్కికి మక్కీగా ఒకరే కావడం. ఆ రోజు ఆ దంపతులిద్దరూ ఎంతో ఆప్యాయంగా పలకరించిన తీరు నన్ను మైమరిపించింది. సత్యమూర్తిగారు, ఇంట్లోనే వున్న తన స్టూడియోకి తీసుకెళ్ళి, తను వేసే చదువ్రులావు కార్టూన్ల ఒరిజినల్స్ చూపించి థ్రిల్ చేసారు. జోగీశ్వరిగారేమో వాళ్ళ బాబు భాస్కర్ (అప్పటికి రెండు మూడేళ్ళ బాబు) ఓ క్రేయాన్ స్టిక్‌తో వాళ్ళ నాన్నగారి బొమ్మ వెయ్యడానికి చేసే ప్రయత్నం గురించి చెప్పి నవ్వించారు.

ఆ రోజు, అలా ఆనందంతో కడుపు నిండిపోయిన నేను, ఇంక వెళ్ళొస్తానంటే, ఆ దంపతులిద్దరూ నన్ను వదలక, ఆప్యాయంగా నాచేత వాళ్ళింటి విందు భోజనం చేయించి మరీ దీవించారు.

అక్కడున్న కాసేపూ సత్యమూర్తిగారు కార్టూన్ల గురించి, వాటిని వేసేందుకు చూపాల్సిన జాగ్రత్తల గురించి, నాకు వివరంగా బోధపరిచారు. భోజనానంతరం



వారి బ్లెస్సింగ్స్‌తో బయటికి వచ్చి, మెట్లు దిగుతుండగా, సత్యమూర్తిగారు "ఒక్క క్షణం ఆగండి!" అంటూ, నన్ను నిలువరించి, లోపల్నుంచి ఓ చిన్న పేకట్ తెచ్చి నా చేతికిచ్చి–"దీన్ని వాడండి! Wish you all the best! " –అంటూ మరోసారి దీవించారు.

అది స్వామి విభూతి ప్రసాదం అయ్యుంటుందని అనుకుంటూ విప్పి చూసిన నాకు, అందులో ఓ చిన్న ఇండియన్ ఇంక్ పాళీ కనబడింది. అదొక ఇంపోర్టెడ్ నిబ్. ఎక్కువగా తన బొమ్మలన్నీ ఆ బ్రాండ్ నిబ్‌తోనే ఆయన వేస్తుంటారు... నంబర్3 సేబుల్ హెయిర్ బ్రష్షుతోనే శ్రీ బాపూగారు ఎక్కువగా బొమ్మలేసినట్టు. సత్యమూర్తిగారు బహూకరించిన ఆ నిబ్ నాకు ఓ పెద్ద వరంగా పని చేసింది. అంతవరకు బొమ్మలేసేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసిన నాకు, ఆయనిచ్చిన నిబ్‌తో వెయ్యడం మొదలెట్టాక, బొమ్మలెయ్యడం ఎంతో సుళువనిపించింది.

దాన్ని ఓ మంత్రించిన తాయెత్తులా నేను భద్ర పరుచుకున్నాను.

ఇలా సత్యమూర్తిగారితో ఆనాటి తొలి పరిచయం నాకెన్నో తీపి గుర్తులు మిగిల్చింది.

కార్టూన్ రంగానికి ఆయన అపారమైన సహకారాన్నందించారు. ఆంధ్రభూమి వీక్లీలో కొన్ని సంవత్సరాలబాటు కార్టూన్ చిత్ర కళ మీద సత్యమూర్తిగారు అద్భుతమైన రేఖాచిత్ర పాఠాలను ధారావాహికగా అందించారు. ఆ తర్వాత అవి తెలుగు, ఇంగ్లీషు భాషల్లో పుస్తకాలుగా వెలువరించి అతి సరసమైన ధరకే లభింపజేసారు.

తమ కార్టూన్ ప్రావీణ్యాన్ని కేవలం పత్రికా కాలక్షేపానికే పరిమితం చేయక, దానికో ప్రయోజకత్వాన్ని తీసుకొచ్చి, చూపరులను నవ్విస్తూ ఆకట్టుకొనే కార్టూన్ యాడ్లను ఎన్నో ఆయన రూపొందించారు.

మన సత్యమూర్తిగారు కేవలం కార్టూనిస్టు మాత్రమే కాదు. చదువ్రులావుకన్నా ఎంతో చక్కటి అందగాడు. డా.అక్కినేని నాగేశ్వరరావుగారు నిర్మించిన 'సుడిగుండాలు' చిత్రంలో సత్యమూర్తిగారు ఓ మంచి పాత్రను పోషించారు కూడా.

శ్రీసాయిభగవానుడు సత్యమూర్తిగారి కుటుంబాన్ని, ఆయురారోగ్య, ఐశ్వర్యాలతో పది కాలాలబాటు చల్లగా చూడాలని మనసారా కాంక్షిస్తున్నాను.

వారి దీవెనలు, సహకారం మన కార్టూనిస్టులందరికీ పెద్ద చేయూతగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాను **–శంకు.**



దొంగ విన్నపం

బోడపాటి రమేష్
9848045105

అపరిచితులైన దొంగ గారికి,

నమస్కారం. మనం ఒకరి నొకరు కలుసుకోలేం. తారసపడలేం. పరిచయం చేసుకోలేం. నిజానికి మీరెవరో తెలీదు కదా! మీరు క్షేమమని తలుస్తాను. మీ చూపుపడనంత వరకూ మేం క్షేమంగానే ఉంటాము. మీరెప్పుడైనా మా ఇంటికి వచ్చినా మేం మీకు ఎటువంటి మర్యాదలూ చేయలేం... మా ఇంటి తలుపులు అతిథుల కోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయి. కానీ మేం ఇంట్లో ఉన్నప్పుడు మీరు రారు కదా! మా భాగ్యమే మీ భాగ్యం.



మా అజాగ్రత్తా మీకు ఆధారం. మీరీ మధ్య రాత్రిళ్ళు దొంగతనాలు చేస్తూ తీరిక లేకుండా ఉన్నారనుకుంటాను. రాత్రిళ్ళు మేలుకుని ఆరోగ్యం పాడు చేసుకోకండి.

ఎందుకంటే మాలాగా మీరు నైట్ డ్యూటీలో నిద్రపోతూ పని చేసుకోలేరు. దీపం లేనప్పుడే ఇల్లు చుట్టబెట్టుకోవాలి అనే సూత్రం మీరు పాటిస్తున్నా చీకట్లో ఏ కాలో చెయ్యో విరిగిందంటే ప్రమాదం... దొరికి పోవచ్చు కూడాను.అయినా బిక్కు బిక్కు మంటూ చీకట్లో తడుముకుంటూ దొంగతనం చేయాలంటే చిరాగ్గా ఉంటుంది. పగలయితే దర్జాగా దొరబాబులాగా చెలామణి అవవచ్చు.

మన నాయకులే మీకు ఆదర్శం.వాళ్ళని చూసి మీరు చాలా నేర్చుకోవాలి. కోట్లు కోట్లు జనుల సొమ్ము దోచుకుంటున్నా మనది కాదులే అనుకుని వాళ్ళనే అందలం ఎక్కిస్తూ... మళ్ళీ మళ్ళీ...కోట్లు దోచుకునేందుకు ద్వారాలు తెరుస్తున్న సదరు ఓటర్ల మనస్తత్వం కలిగిన నేను కొన్ని విన్నపాలు చేస్తున్నాను....

మీరు మా ఇంటికి వచ్చినప్పుడు తలుపులు, కిటికీలు విరగ్గొట్టకండి...కన్నం అసలే వద్దు. సిమెంటు, ఇసుక ధరలు బాగా పెరిగి పోయాయి. ఇసుకయితే తూకానికి కూడా దొరకటం లేదు.

వెనకటికి ఇసుకేస్తే రాలనంత జనం అనే వాళ్ళు. ఇప్పుడు ఇసుక కొనలేక జనాలు రాలి పోతున్నారు.

సరే అవన్నీ కష్టపడి కొనుక్కున్నా కూలి వాళ్ళను కుదుర్చుకోవటం వాళ్ళ చేత పని చేయించుకోవటం చాలా అసాధ్యమయిన పని అయిపోయింది. మీరే నయం మీకు కావలసినవి దోచుకుపోతారు.

వీళ్ళు మా ఎదురుగానే మమ్మల్ని దోచేస్తారు. దొంగతనం అని కూడా చెప్పుకోలేం.

అన్నట్టు పండకకి మా అల్లుడు గారు వచ్చి వెళ్ళారు కాబట్టి కొద్ది రోజుల దాకా మా ఇంటి ఛాయలకు రాకండి. అనవసరమైన శ్రమ.

అమ్మాయిని అల్లుడి గారి దగ్గర దింపటానికి వెళుతున్నాం. అయినా మీరు రావొద్దు. మేము కాలు చెయ్యి కూడదీసుకున్న తర్వాత వద్దురు గాని.

ఏమిటీ... మా కోడలొస్తుంది కదా.... అంటారా? సర్లేండి ఆ అమ్మాయెంతో తెస్తుందని మేమేం ఆశపడటంలేదు. మీరు కూడా అనవసరంగా శ్రమ పడకండి.

మేము ఊరు ఎప్పుడు వెళ్ళేది ఎప్పుడు తిరిగొచ్చేది వివరాలు మీకు త్వరలోనే చేరవేస్తాం.

మా ఆవిడ వీధిలో నిలబడి వివరాలు పక్కింటి వాళ్ళకు చెప్తూ ఉంటుంది. అవి వినే ఏర్పాట్లు మీరే చేసుకోగలరు. మీరు ఎప్పుడు వచ్చేది ముందుగా తెలియచేస్తే (?) బాంక్ నుండి డబ్బు, లాకర్ నుండి నగలు తెచ్చి ఇంట్లో దాచుకుంటాం.

ఏదో మా స్థాయికి తగ్గట్టుగా బీరువా తాళాలు, ఇంటి తాళాలు ఎక్కడ పెడతామో కూడా తెలియ పరుస్తాము.

మా ఫోన్ నెంబరుకు ఫోన్ చేసి... మేము ఇంట్లో ఉన్నది లేనిది మీరు ఫోన్ చేసి రూఢి చేసుకోవచ్చు.

మీరు రాత్రి వేళే దొంగతనం చేయాలని నిశ్చయించుకుంటే మా కాంపౌండు గోడ లోపల ఇసుక కుప్ప ఉంటుంది. ఎప్పుడో చౌకగా ఉన్నప్పుడు కొని పడేశాను. ఆ కుప్ప మీదుగా లోపలికి దూకండి కాలు, చెయి దోక్కు పోయినా విరగవు. పని సులువుగా అయిపోతుంది.

మా పక్కింటి వాళ్ళకు నిద్ర భంగం కలుగ కుండా శబ్దం చేయకుండా రండి.

మీకు తెలిసిన విషయమే అయినా ముందు జాగ్రత్తగా చెపుతున్నాను.

అయినా అందరూ ఏ.సి.లు వేసుకుని గది తలుపులు బిడాయించి పడుకుంటారు. కరెంటు పోతే గాని మెలకువ రాదు. అది మాత్రం మీ అదృష్టం మీద ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే వాన రాకడ, కరెంటు పోకడ ఎవరికీ అంతు పట్టడం లేదు.

మీ పని పూర్తయిన తర్వాత తలుపులు దగ్గరికి లాగి, తాళాలు వీలయితే వేసి వెళ్ళండి. లేకపోతే ఇంకెవరైనా వచ్చి మీరు వదిలేసిన వస్తువులు పట్టుకుపోతే మీకు అనవసరంగా చెడ్డ పేరు వస్తుంది.

అన్నట్టు వేలి ముద్రలు బాగా పడేటట్లు చూసుకోండి. లేకపోతే అసలు దొంగ తనమే జరగలేదని పోలీసు వాళ్ళు అనుమానించి సతాయిస్తారు.

మీ లూటీ... వాళ్ళ లాఠీ ఒకేసారి తట్టు కోవటమంటే మాటలా!

పైన మకుటం చూసి ఉడుక్కోకండి ఇది దొంగ గారికి విన్నపం అని మొదలు పెట్టాను.

ఈ విన్నపం వ్రాయటం పూర్తయి చూసు కుంటే ఎవరో దొంగ వెధవ (సారీ దొంగ గారు) ఆ 'గారికి' అనే పదాన్ని పట్టుకెళ్ళారు.

ఈ విన్నపాన్ని ఇంత సేపు చదివినందుకు ధన్యవాదాలు. ఎన్నో దొంగతనాలు చేయా లసిన సమయాన్ని మాకు కేటాయించినందుకు మీకు రుణ పడి ఉన్నాము.

పైన విన్నపించినవి తు.చ. తప్పకుండా పాటించండి.

-మీ రాకను ఆశించని
ఇంటి యజమాని.



'చదువు(లావు' సృష్టికర్త



ముందు ఓ(టెండు వెం(టుకలు రేగి ఒత్తయిన జుత్తుతో కొంచెం సన్నగా, పొడుగ్గా నీట్‌గా టక్‌వేసుకుని స్టైలిష్ కళ్ళజోడుతో స్మార్ట్‌గా వుండి ఆంధ్రపత్రిక వీక్లీలో వారంవారం దర్శనమిచ్చే 'చదువు(లావు' అంటే 1963, 64 ప్రాంతాల్లో తెలుగునాట కుర్రకారు అబ్బాయిలకు, అమ్మాయిలకు బోల్డు క్రేజ్!

అలా ఎందరో పాఠకుల్ని అలరించిన ఆ 'చదువు(లావు' సృష్టికర్త ప్రముఖ కార్టూనిస్టు సత్యమూర్తి గారు! ఆ కార్టూన్ సీరియల్ ఎంత పాప్యులర్ అంటే, ఏదైనా ఫంక్షన్లో సత్యమూర్తి గారు కనిపిస్తే చాలు, అభిమాను లంతా ఆయన చుట్టూ మూగేవారు ఆటో(గ్రాఫుల కోసం.

నాకు సత్యమూర్తి గారు ఆప్తమిత్రులు. వారిని మొదటిసారి నేను కలుసుకుంది 1969 మార్చిలో. అప్పటికి సుమారు రెండేళ్ళ క్రితమే నేను స్టేట్‌బ్యాంక్‌ఆఫ్ ఇండియాలో ఉద్యోగంలో చేరాను. ఈ మధ్యకాలంలో పేరొందిన వివిధ తెలుగు వారపత్రికలలో ఓ పది-పదిహేను కార్టూన్లు అచ్చయిన బుల్లి కార్టూనిస్టుని నేను. మా బ్యాంక్‌లోని నా కవిమిత్రుడు సత్యప్రసాద్ గారికి (సినీ దర్శకుడు వీయెన్ ఆదిత్యగారి నాన్నగారు) సత్యమూర్తి గారితో మంచి పరిచయం ఉంది. ఓ రోజున ఆయన నాతో – "రామకృష్ణ గారూ, సాయంత్రం మీకు వీలుంటే సత్యమూర్తి గారింటికి వెళ్దాము" అన్నారు.

